J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 41 సంచిక : 30 31.12.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

2022

పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు
నూతన సంవత్సర శుభాకాంక్షలు సం/-

# ఓ మై గాడ్.. ఒమిక్రాన్!

## విదేశాల నుండి వచ్చేసింది

### ➤ క్రమేణా పెరుగుతున్న కేసులు ➤ భయం వద్దు.. జాగ్రత్తలే ముద్దు

***కరోనా మహమ్మారి ఒమిక్రాన్ రూపంలో మరోసారి తన ప్రతాపం చూపడానికి కదిలింది. ఇప్పటికే ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది. బయట దేశాల్లో పుట్టి, ప్రయాణికుల ద్వారా మనదేశానికి వచ్చి, ఇప్పుడిప్పుడే ఒక్కొక్కరినీ పలకరించుకుంటూ వెళ్తోంది. మనరాష్ట్రంలో ఇప్పటికే 16 మందిలో తానున్నానని రుజువుచేసింది. వీరిలో 13 మందిని విదేశాలలోనే కౌగిలించుకోగా, మరో ముగ్గురిని ఇక్కడికి వచ్చిన తరువాత ఆవహించింది.***

ఇటీవల కాలంలో శుభకార్యాల హడావుడి పెరిగింది. కొత్త సంవత్సరం రానుండడంతో షాపింగుల సందడి కూడా ఎక్కువగానే ఉంది. మరోవైపు బళ్ళు తెరుచుకున్నాయి. గుళ్ళు క్రిక్కిరిసి ఉంటున్నాయి. రైళ్ళు, బస్సులు, విమానాలు కిటకిటలాడిపోతున్నాయి. బార్లు, రెస్టారెంట్లు, సినిమా హాళ్ళు కళకళలాడుతున్నాయి. సరిగ్గా ఇదే అదనుగా ఒమిక్రాన్ రూపంలో కరోనా తన పని తాను చేసుకుపోవడానికి రెడీ అయ్యింది. విదేశాలనుండి మన దేశంలోకి వచ్చి నేనున్నానంటూ బయలుదేరింది. ఈ మాయలమారి రాకతో మళ్ళీ దేశంలో క్రమేణా కంటైన్మెంట్ జోన్‌లు పెరుగుతున్నాయి. రాత్రి కర్ఫ్యూలు మొదలయ్యాయ, ఆసుపత్రులు సిద్ధమవుతున్నాయి.

గత వైరస్‌లతో పోలిస్తే ఈ వైరస్ పెద్ద ప్రమాదకారి కాదని వైద్యులు చెప్తున్నారు. అయినా జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరిస్తున్నారు. సామాజిక దూరం, మాస్కు ధారణ, శానిటైజర్ వాడకం తప్పనిసరి అని పదే పదే చెప్తున్నారు. ఇప్పటికే రెండు డోసులు టీకా వేసుకున్నవారి జోలికి ఒమిక్రాన్ రాకపోవచ్చని కూడా చెప్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు 15 – 18 సంవత్సరాల మధ్య ఉన్న బాలలకు కూడా వ్యాక్సిన్ వేసుకోవడానికి అనుమతులు ఇవ్వడం శుభపరిణామం. అలాగే వృద్ధులకు, అత్యవసర సేవలు అందించేవారికి బూస్టర్ డోసుగా మూడవ టీకా కూడా వేసుకోవడానికి లైన్ క్లియర్ చేశారు.

ప్రభుత్వం తన పని తాను చేస్తున్నా, మన కర్తవ్యం మనం పాటించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా వుంది. ప్రమాదం

10లో



# భాజపా భారీ సభ

## విజయవాడ వేదికగా 'ప్రజాగ్రహ సభ'

***ఆం**ధ్ర రాష్ట్రంలో ఈ 31 నెలల కాలంగా వైకాపా పాలన కొనసాగుతోంది. మరో రెండున్నర ఏళ్ళలో ఎన్నికలు రావాల్సి ఉన్నప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు వెళ్తుందేమోనన్న ఊహాగానాలు ఒకవైపు, జమిలి విధానానికి మోడీ ప్రభుత్వం సన్నద్ధమవుతోందనే పుకార్లు మరోవైపు వెల్లువెత్తుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి వేగం పెంచింది.*

10లో





నూతన సంవత్సర శుభాకాంక్షలు

శ్రీ సాయి
కంచి

రోడ్ నెం.2, 2వ మెయిన్‌రోడ్డు, మాగుంట లే అవుట్, నెల్లూరు.
సెల్ : 8919714848.



# ఆనందయ్యా..
# నీ మందొద్దయ్యా

### ➤ గ్రామస్తుల అభ్యంతరం.. పంచాయితీలో తీర్మానం
### ➤ ఆనందయ్య మందుకి రాజకీయ గ్రహణం
### ➤ సొంత పార్టీ ప్రకటనే కొంప ముంచింది

"**ఆ**యనెవరో ఆనందయ్య అంట, కరోనాకి నాటు మందు ఇస్తున్నాడంట, వ్యాధి వచ్చినవారికి తగ్గుతోందంట, రానివారికి రానే రాదంట." కొన్ని నెలల క్రితం నెల్లూరుజిల్లాలోని కృష్ణపట్నం గ్రామానికి చెందిన ఆనందయ్య గురించి దేశమంతా వినపడిన మాట ఇది. అంతేకాదు, విదేశాలలో సైతం చర్చించుకున్న అంశం. సామాజిక మాధ్యమాలలో సంచలనం సృష్టించిన వార్త. ఇప్పుడు అదే ఆనందయ్య మందుకి రాజకీయ గ్రహణం పట్టింది.

10లో

# బీరాపేరులో.. మరో మృతదేహం లభ్యం


కావలి కాలువలో గుర్తించిన కర్రా సంపూర్ణమ్మ మృతదేహం

సంగం మండలంలోని బీరాపేరు వాగులో గల్లంతైన వారిలో ఇటీవల మరో మృత దేహం లభ్యమైంది. ఈనెల 9వ తేది రాత్రి ఆత్మకూరుకు చెందిన కుటుంబసభ్యులు సంగంలోని సంగమేశ్వర స్వామి దేవాలయంలో నిద్ర చేసేందుకు ఆటోలో వెళ్తుండగా దారిలో బీరాపేరు వాగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోను లారీ ఢీకొనడంతో ఆటో వాగులో పడిపోయి అయదుగురు గల్లంతైన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో ఒక బాలిక అక్కడికక్కడే మృతిచెందగా, ఏడుగురు బయటపడ్డారు. అయిదుగురు గల్లంతయ్యారు. రోజుల తరబడి బీరాపేరు వాగులో ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాలు, పోలీసులు జరిపిన గాలింపు చర్యలతో రెండురోజుల్లో ముగ్గురి మృతదేహాలు దొరకగా, ఇటీవల కర్రా సంపూర్ణమ్మ మృతదేహం కావలి–కనిగిరి రిజర్వాయర్ ప్రధానకాలువ హెడ్‌రెగ్యులేటర్ వద్ద గుర్తించారు. గల్లంతైన వారిలో ఇక ఒకే ఒక్కరు దివానపు ఆదెమ్మ ఆచూకీ తెలియాల్సిఉంది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు జరుపుతూనే ఉన్నారు.

# పంబలేరు వాగు దాటుతూ ఇద్దరు గల్లంతు


పంబలేరు వాగు

బీరాపేరు వాగులో ఇటీవల జరిగిన దుర్ఘటన మరువక ముందే, గూడూరు రూరల్ మండలంలోని పంబలేరు వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తూ ముగ్గురు యువకులు వాగు ప్రవాహంలో చిక్కుకుపోయారు. వారిలో ఒకరు ఈదుకుంటూ ఒడ్డుకుచేరి ప్రాణాలతో బయటపడగా, మరో ఇద్దరు గల్లంతయ్యారు. గల్లంతైన ఆ ఇద్దరిలో ఒకరి మృతదేహం లభించింది. మిగిలిన మరొకరి ఆచూకీ తెలియలేదు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గూడూరుల మండలం పోటుపాళెం గ్రామానికి చెందిన తిరునామల్లి భగవాన్, పవన్, తేజ అనే ముగ్గురు యువకులు ఇటీవల పంబలేరు వాగు అవతల ఉన్న పొలం పనులపై పొలాలకు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ముగ్గురూ ప్రవాహంలో కొట్టుకుపోగా తేజకు ఈత రావడంతో ఒడ్డుకు చేరాడు. మిగిలిన ఇద్దరిలో భగవాన్ మృతదేహం లభించగా, పవన్ కోసం గాలిస్తున్నారు.

# కొనసాగుతున్న రెడ్‌క్రాస్ చేయూత



వరదబాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి

జిల్లాలో ఇటీవల సంభవించిన భారీ వానలు, వరద బాధితుల సహాయార్థం రెడ్‌క్రాస్ సంస్థ తనవంతు చేయూతనందిస్తోంది. పూర్తిగా దెబ్బతిన్న పల్లెపాడుకి చెందిన 20 గిరిజన కుటుంబాలకు ఈనెల 25న నిత్యావసర సరుకులను అందజేసింది. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర శాఖ ఛైర్మెన్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరులో సంభవించిన వరదలకి పూర్తిగా నేలమట్టమైన ఇళ్లను నెల్లూరు రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పరిశీలించి తమ దృష్టికి తీసుకు వచ్చారని, బాధితుల కోసం వెనువెంటనే వాటిని ఏపీ స్టేట్ రెడ్‌క్రాస్ అధ్యక్షులైన రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ దృష్టికి తీసుకువెళ్లగా, వారు వెంటనే స్పందించి తక్షణ సహాయం కింద నిత్యావసర వస్తువులైన బియ్యం, పప్పులు, దుప్పట్లు వగైరాలను పంపడం జరిగిందని తెలియజేశారు. వరదబాధితుల కోసం నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ శాఖ చేస్తున్న అమూల్యమైన సేవలను ఆయన ప్రస్తావిస్తూ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డిని అభినందించారు. నెల్లూరు రెడ్‌క్రాస్ ఆదర్శవంతమైన సేవలందిస్తోందని కొనియాడారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే వరదల్లో చిక్కుకుని నిరాశ్రయులైన అనేకమందికి టార్పాలిన్ పట్టలు, దుప్పట్లు, వంట సామగ్రి, దోమతెర తదితర వస్తువులను ఇస్తున్నామని చెప్పారు. జిల్లా రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మెన్ డి.సుధీర్‌నాయుడు, కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, రాష్ట్ర శాఖ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు డి.రవిప్రకాష్, దాసరి రాజేంద్రప్రసాద్, గునపాటి ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్లు సిహెచ్ అజయ్‌బాబు, బి.వెంకురెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీరంజని, సుమంత్‌రెడ్డి, కో–కన్వీనర్లు రవీంద్రరెడ్డి, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## సిపిఓ సురేష్‌కుమార్

# గుండెపోటుతో హఠాన్మరణం



జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి (చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్–సిపిఓ)గా పనిచేస్తున్న సురేష్‌కుమార్ ఈనెల 26న అనారోగ్యంతో హఠాన్మరణం చెందారు. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన ఆయన చికిత్స కోసం ఈనెల 13న నెల్లూరులోని బొల్లినేని ఆసుపత్రిలో చేరారు. చికిత్సపొందుతున్న ఆయనకు గుండెపోటు రావడంతో మృతిచెందారు. సురేష్‌కుమార్‌కు మెరుగైన వైద్యం అందేలా ఆసుపత్రి వారితో కలెక్టర్ ఎప్పటికప్పుడు మాట్లాడారు కూడా. అయినా ఫలితం లేకపోయింది. సురేష్‌కుమార్ మృతదేహాన్ని అధికారులు ఆయన స్వస్థలమైన తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తికి తరలించారు.

## సిపిఓ మృతి బాధాకరం

ఈనెల 27న కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సంతాపసభలో కలెక్టర్ చక్రధర్‌బాబుతో పాటు పలువురు అధికారులు పాల్గొని సురేష్‌కుమార్ మృతికి సంతాపం ప్రకటించారు. ఆయన సేవలను కొనియాడారు. ఒక మంచి అధికారిని కోల్పోవడం బాధాకరమన్నారు. జాయింట్ కలెక్టర్లు హరేందిరప్రసాద్, గణేష్‌కుమార్, విదేహ్‌ఖరే, రోజ్‌మాండ్, డిఆర్‌ఓ చిన్నఓబులేశు, కెఆర్‌సిసి స్పెషల్ డెప్యూటి కలెక్టర్ దాస్, డిఆర్‌డిఏ పీడీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


స్మృత్యంజలి

ఆత్మీయానుబంధాలను మాకు పంచి
చెదరని మీ చిరునవ్వును మాకు మిగిల్చి
మీరు మాకు దూరమై 16 ఏళ్లు గడిచాయి.
మరపురాని మీ మధుర జ్ఞాపకాలతో...



డా॥ సి.మధుసూదనరెడ్డి
జననం: 04.11.1950 మరణం: 31.12.2005

భార్య:
డాక్టర్ చిట్టమూరు భారతి

కుమారుడు:
చిట్టమూరు లోహిత్

కుమార్తె:
ప్రణీత అరవింద్

చెల్లెలు:
నిర్మల


అల్లుడు:
అరవింద్ దినకర్

బావ:
డా॥ సి.యం.కె.రెడ్డి

మనుమరాళ్లు:
ఆద్య అరవింద్, స్మియ అరవింద్

మరియు కుటుంబసభ్యులు

# కళ్యాణ వైభవం...!




## శుభమస్తు పెళ్ళి సంబరం

నెల్లూరు నగరంలోని 'న్యూ రాజ్యలక్ష్మి హాల్', 'శుభమస్తు' షాపింగ్ మాల్‌ల అధినేత బయ్యా శ్రీనివాసులు - వెంకటశైలజల కుమారుడు **శ్రీనివాస రాణా ప్రతాప్ - రుషిక**ల కళ్యాణ వేడుక డిసెంబర్ 19వ తేదీ అనంతపూర్‌లో వైభవంగా జరిగింది. డిసెంబర్ 25న నెల్లూరులో జరిగిన వీరి పెళ్ళి రిసెప్షన్ వేడుకలో పలువురు రాజకీయ, వ్యాపార, అధికార, అనధికార ప్రముఖులు పాల్గొని నవ దంపతులను దీవించారు. నెల్లూరీయులు కనీ వినీ ఎరుగని రీతిలో రిసెప్షన్ వేడుకను నిర్వహించింది బయ్యా కుటుంబం. విదేశీ వనితలచే సంగీతం, అయోధ్య ఆలయ ఆకృతిలో ఏర్పాటు చేసిన సెట్టింగ్‌లో వధూవరుల మాలల మార్పిడి, అనేక మంది జాతీయ, అంతర్జాతీయ కళాకారులచే పలు ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. జాతీయ, అంతర్జాతీయ వంటకాలతో పంచభక్ష పరమాన్నాలను రిసెప్షన్ విందుగా వడ్డించారు. భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ కొత్త జంటను ఆశీర్వదిస్తూ... తమ సందేశాలను పంపించారు.

## కొత్త సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



వెల్లంపల్లి శ్రీ స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి వారి దేవస్థానం వారు ప్రచురించిన నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్‌ను ఈ నెల 29వ తేదీన వెంకటగిరిలోని పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద.. ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి, వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి తదితరులు.

## సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో.. బంపర్ డ్రా

- హుండాయ్ శాంత్రో మాగ్నినా కారు విజేత.. కోట హరిణి
- పలువురికి బంగారు, వెండి బహుమతులు




క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఇటీవల నగరంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వారు నిర్వహించిన బంపర్ డ్రాలో ప్రథమ బహుమతి స్థానిక స్టోన్‌హౌస్‌పేట లక్ష్మీపురానికి చెందిన కోట హరిణి గెలుచుకుంది. ఈ సందర్భంగా షాపింగ్‌మాల్ నిర్వాహకులు ఆ లక్కీ విజేతను అభినందిస్తూ ఆమెకు హుండాయ్ శాంత్రో మాగ్నినా కారును బహుకరించారు. ఆ తర్వాత ద్వితీయ బహుమతులుగా తొలి మూడు బహుమతులను షేక సర్దార్, ఆర్.మహేష్, కె.సి ఫణీత్‌లు గెలుచుకోగా వారికి హోండా షైన్ బైక్‌లను బహుమతులుగా ఇచ్చారు. అదేవిధంగా 3వ బహుమతిగా 3 బంగారు నెక్లెస్‌లను పి.శ్రీనివాసులు, ఎస్ మేరి ప్రసన్నకుమారి, పి.రియాన్‌లకు, 4వ బహుమతిగా ముగ్గురికి వెండి పాట్‌లను వరుసగా రవీంద్ర, కోటేశ్వరరావు, సల్మాన్‌లకు అందజేశారు. వారం లక్కీ డ్రాలో ప్రథమ బహుమతిగా అయిదుగురికి శ్యామ్‌సంగ్ ఎ.7 వైట్ ట్యాబ్‌లు, ద్వితీయ బహుమతిగా అయిదుగురికి రియాల్‌మి ఆండ్రాయిడ్ టీవీలు, తృతీయ బహుమతిగా 10 మందికి వెండిగ్లాసులు అందజేశారు. జనవరి 15 సంక్రాంతి సందర్భంగా కూడా 2వ బంపర్ డ్రా నిర్వహిస్తామని, వారం లక్కీ డ్రాలు 2022 జనవరి నెల 1,8, 15 తేదీల్లో జరుగుతాయని షాపింగ్‌మాల్ నిర్వాహకులు తెలియజేశారు. ఈ లక్కీ బంపర్ డ్రా కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్పీ అబ్దుల్ సుభాన్ పాల్గొని లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపికచేశారు.

## 15-18 ఏళ్ళలోపు వారికి.. జనవరి 3 నుంచి టీకా

కోవిడ్‌ను నియంత్రించేందుకు ప్రభుత్వం మైనర్లకు కూడా టీకా వేయాలని నిర్ణయించిందని, జనవరి 3 నుంచి జిల్లాలోని 15-18 ఏళ్ళలోపు వారికి జనవరి 3నుంచి కోవాగ్జిన్ టీకా వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని డిఎంఅండ్‌హెచ్‌ఓ రాజ్యలక్ష్మి చెప్పారు. బుధవారం ఆమె తమ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతూ టీకా వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. 60 ఏళ్ళు దాటిన వారికి, ఫ్రంట్ లైన్ వర్కర్లకు, వైద్యశాఖ సిబ్బందికి జనవరి 10వ తేది నుంచి ఇమ్యూనిటీ బూస్టర్‌గా 3వ టీకాను కూడా వేయనున్నామని, రెండో డోసు తీసుకున్నవారికి 9 నెలల విరామం ఉంటే మూడో వ్యాక్సిన్ వేయనున్నామని చెప్పారు. ఒమిక్రాన్ విజృంభిస్తున్న నేపథ్యంలో ముందస్తుగా అందరూ టీకా వేసుకోవాలని ఆమె సూచించారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్‌గా.. బాధ్యతలు చేపట్టిన శారద



దొంతు శారదకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెప్తున్న గ్రంథాలయ సిబ్బంది

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్‌గా దొంతు శారద ఈనెల 29న బాధ్యతలు చేపట్టారు. నెల్లూరులోని రేబాలవారివీధిలో ఉన్న కేంద్ర గ్రంథాలయంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేస్తామని, విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు, సీనియర్ సిటిజన్లకు అవసరమైన కొత్తపుస్తకాలను కొనుగోలుచేసి గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. తొలుత ఆమె కేంద్ర గ్రంథాలయానికి రాగానే సిబ్బంది స్వాగతించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. జిల్లా గ్రంథాలయసంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి సిహెచ్ ప్రసాద్, ఉద్యోగులు కెవి కృష్ణయ్య, ఎస్ శశిబాబు, టి.పూర్ణచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్పీలైన డిఎస్పీలు

రాష్ట్రంలో 36 మంది డిఎస్పీలను ఏఎస్పీలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఈనెల 29న డిజిపి గౌతమ్‌సవాంగ్ ఉత్వర్వులిచ్చారు. అందులో నెల్లూరుజిల్లాకు చెందిన ఇద్దరు డిఎస్పీలు కూడా ఉన్నారు. ఇంటలిజెన్స్ డిఎస్పీ బి.శ్రీభవానిహర్ష, కావలి డిఎస్పీ డి.ప్రసాద్‌లు ఏఎస్పీలుగా ప్రమోషన్ పొందారు. నెల్లూరు సెబ్ జేడీగా ఉన్న కె.శ్రీలక్ష్మి ఇదివరకే ఏఎస్పీగా ఉద్యోగోన్నతి పొందినప్పటికీ ఈ కొత్త జాబితాలో ఆమె పేరు కూడా చేర్చినట్లు సమాచారం.



## 'ప్రభా'తం

# 2022లోనైనా..కష్టాలు తీరేనా?

కరోనా సంవత్సరంగా ముద్రపడ్డ 2020 నుంచి 2021వ సంవత్సరం పూర్తయి పోయినా.. కరోనా పీడ విరగడయ్యిందే లేదు. పైపెచ్చు రకరకాల వేరియంట్ల రూపాలతో కరోనా కస్సుబుస్సుమంటూనే ఉందే తప్ప దాని వీరంగంలో ఏమాత్రం మార్పు లేదు. ప్రపంచ చరిత్రలోనే కనీవినీ ఎరుగనివిధంగా ఇప్పటికే దీని బారినపడిన వారి సంఖ్య 28 కోట్లు దాటిపోయింది. ఇక రేపోమాపో 30 కోట్లకు చేరిపోతుంది కూడా. ఈ వ్యాధికి బలైపోయిన వారి సంఖ్య 55 లక్షలు దాటుతోంది. మానవాళికి ఇంతకన్నా పెద్ద విపత్తు ఏముంటుంది?..నేటికీ కరోనా 'ఒమిక్రాన్' రూపంలో ప్రపంచాన్ని భయపెడుతూనే ఉంది. ఈ మాయదారి వ్యాధి పీడ..ఈ ఏడాదైనా విరగడైతే బావుణ్ను!.. ఈ కొత్త సంవత్సరమైనా ప్రజలు కష్టాలు తీరిపోతే చాలు..అదే పదివేలు!...

కొత్త సంవత్సరం-2022 రానే వచ్చింది. అయినా మునుపటి కష్టాలు తీరుతాయో లేదో తెలియదు కానీ ప్రపంచమంతా అన్ని బాధలూ తొలగిపోయి సుఖశాంతులతో జీవించాలన్నది అందరి ఆకాంక్ష. అదేం కర్మమో కానీ..కరోనా రాకాసి వ్యాధి పీడ వచ్చిపడినప్పటినుంచి ప్రపంచానికి శాంతి లేదు. సుఖం అంతకన్నా లేదు. కరోనా సంవత్సరంగా ముద్రపడ్డ 2020 నుంచి 2021 పూర్తయిపోయినా.. కరోనా పీడ మాత్రం విరగడ కాలేదు. పైపెచ్చు రకరకాల వేరియంట్ల రూపాలతో కరోనా కస్సుబుస్సుమంటూ ప్రజల ఉసురుపోసుకుంటోందే తప్ప దాని వీరంగంలో ఏమాత్రం మార్పు లేదు. దీనిదెబ్బకు ప్రపంచమంతా నేటికీ బెంబేలెత్తిపోతూనే ఉంది. ఇప్పటికే దీని బారినపడి బాధలు పడుతున్న వ్యాధిగ్రస్తుల సంఖ్య 28 కోట్లు దాటిపోయి రేపోమాపో 30 కోట్లకు చేరిపోతోందంటే ఈ వ్యాధి తీవ్రత ఎంతగా పెరిగిపోతోందో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచ చరిత్రలోనే కనీవినీ ఎరుగని విధంగా ఇప్పటికే ఈ వ్యాధికి బలైపోయిన వారి సంఖ్య 55లక్షలు దాటుతోంది. మనదేశంలోనూ కరోనా కేసులు మూడున్నర కోట్లు దాటిపోయాయి. దాదాపు 5 లక్షల మంది దాకా ఈ వ్యాధితో మృత్యువు పాలయ్యారు. ఇంతకన్నా మానవాళికి పెద్ద విపత్తు ఏముంటుంది?..నేటికీ కరోనా 'ఒమిక్రాన్' రూపంలో ప్రపంచాన్ని భయపెడుతూనే ఉంది. ఎప్పుడు ఎవరు దీని పాలవుతారో తెలియని పరిస్థితి. కంటికి కనిపించని సూక్ష్మక్రిమి ప్రపంచాన్నే గడగడలాడిస్తోంది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంలో ధీటుగా రాణిస్తూ మానవుడు అమేయమైన జ్ఞానసంపదతో అజేయుడుగా నిలుస్తున్న వేళ.. ఈ రాకాసి వ్యాధి మానవాళినంతా పట్టి పీడిస్తుండడం, సుఖశాంతులు లేకుండా అన్ని దేశాల్లో ప్రజలు ప్రాణభయంతో విలవిలలాడుతుండడం దురదృష్టకరం. అనేక రకాల వైద్యపరిశోధనలతో, అద్భుతమైన వ్యాక్సిన్లతో కరోనాను తరిమికొడుతూ ముందుకు పోతున్న ప్రపంచానికి కరోనా ఇంకా నేటికీ ఒక పెద్ద సవాల్‌గానే పరిణమిస్తోంది. మానవుడు ఎన్ని ప్రయోగాలు చేస్తున్నా కంటికి కనిపించకుండా, ఎవరి చేతికీ దొరక్కుండా, రంగులు రూపాలు మారుస్తూ అంతుచిక్కని వ్యాధిగా తయారై ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తూనే ఉంది. తాజాగా దీని వికృతరూపాలుగా 'ఒమిక్రాన్' వంటివి పుట్టుకొస్తూనే ఉన్నాయి. మనదేశంలోకి ఇది రాదేమో అనుకుంటుంటే ఇప్పుడు దేశంలోని పలు రాష్ట్రాల్లోకి జొరబడి వీరవిహారం చేస్తోంది. మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే 400కు పైగానే ఒమిక్రాన్ కేసులు రావడంతో దేశమంతా కలవరపడుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో కూడా సుమారు 80 కేసులు నమోదయ్యాయంటే ఒమిక్రాన్ ఎంత వేగంగా విస్తరిస్తోందో తేటతెల్లమవుతోంది. ఈ మాయదారి వ్యాధికి అంతమెప్పుడో ఎవరికీ అర్థం కావడం లేదు. 2020 కరోనా సంవత్సరం పోయింది కదా 2021లోనైనా దాని నుంచి విముక్తి కలుగుతుందని ఆశించినా ఫలితం లేదు. గత ఏడాదంతా కూడా దీని భయమే. కొంతలో కొంత మనదేశంలో మంచి వ్యాక్సిన్లు రాబట్టి వైద్యుల చొరవ, ప్రభుత్వాల హెచ్చరికలు పటిష్టంగా ఉండబట్టి కొంతవరకైనా ప్రజలు ఈ వ్యాధి బారిన పడకుండా బతికిపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో కరోనా విజృంభణ ఇంకా భయంకరంగానే ఉండడంతో ఆయా దేశాలు మరింతగా హడలిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు న్యూ ఇయర్ వచ్చినా 'హ్యాపీ' ఎక్కడా కనిపించడం లేదు. అందుకు తగ్గట్టుగానే కరోనా దెబ్బతో అన్ని వ్యవస్థలూ చితికిపోయాయి. ఆర్థికపరిస్థితి అస్తవ్యస్తమైపోయింది. పరిశ్రమలు మూతబడ్డాయి. చదువులు చతికిలబడ్డాయి. అన్ని రంగాలూ కోలుకోలేనంతగా దెబ్బతిన్నాయి. ఉద్యోగాలు, ఉపాధి కరవై కోట్లాదిమంది అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఈ బాధలు చాలవన్నట్లు మరోవైపు ధరల బాదుడుతో పేదలు, సాదాసీదా మధ్యతరగతి ప్రజల జీవనం అస్తుబిస్తుగా మారింది. పెట్రో ధరలతో పాటు అన్ని వస్తువుల ధరలు భారీగా పెరిగిపోయి ప్రజల బతుకంతా అస్తవ్యస్తమైపోయింది. చివరికి నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు కూడా ఆకాశంలోకి వెళ్లిపోయాయి. నిరుపేదలకు, సామాన్యులకు ఏవీ అందడం లేదు. కో అంటే కోటి బాధలన్నట్లు మనదేశంలోనే కాదు, ప్రపంచమంతా ఎక్కడ చూసినా వేదనా రోదనలే వినిపిస్తున్నాయి. ఎవరిలోనూ సంతోషమన్నది కనిపించడం లేదు. 2021 కర్కశంగానే కాటేస్తూ వెళ్లిపోయింది. పోతూపోతూ కూడా ప్రమాద రూపంలో వచ్చిపడిన మృత్యువు దేశానికి అత్యంత ముఖ్యమైన త్రివిధ దళాధిపతి జనరల్ బిపిన్ రావత్‌తో పాటు మరో 11 మంది వీరసైనికులను కూడా పొట్టనబెట్టుకుంది. ఇంత ఘోరం దేశ చరిత్రలో ఎప్పుడూ లేదు. ఇలా 2021.. చేయకూడని ఘోరాలన్నీ చేసేసి మౌనంగా వెళ్ళిపోయింది. గతంలో కొత్త సంవత్సరం వస్తుందంటే ఏ పండుగ సంబరమో తెస్తుందని, కొత్త విజయాలను కట్టబెడుతుందని అందరూ ఆశించేవాళ్ళు. ఇప్పుడు కొత్త సంవత్సరం వస్తుందంటే ఇంకా ఏ కొత్త విపత్తు తెస్తుందో..ఇంకెంతమంది ప్రాణాలు బలితీసుకుంటుందోనని భయపడిపోతున్నారు. అయినా సరే, అన్ని దేశాలు ఏకంగా నిలబడి ఒక్క కరోనానే కాదు.. ఎలాంటి విపత్తు వచ్చినా సరే ధైర్యంగా ఎదుర్కోవాలి. ముందు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉంటూ కరోనా వంటి విషపు వ్యాధుల్ని తరిమికొట్టాలి. అందుకు తగ్గ శక్తి యుక్తుల్ని ఆ భగవంతుడు ప్రపంచానికి ప్రసాదించాలని, ఈ కొత్త ఏడాదైనా కరోనా రాకాసి కనుమరుగై పోవాలని, ప్రపంచ మానవాళి అంతా సుఖశాంతులతో జీవనం సాగించాలని మనసారా కోరుకుందాం!.. 2020-2021లా 'శాడ్ ఇయర్స్'లా కాకుండా... '2022-న్యూ ఇయర్'లోనైనా అటు ప్రపంచానికి, ఇటు మన దేశానికి ఉన్న కష్టాలన్నీ తీరిపోవాలని కోరుకుంటూ..'న్యూ ఇయర్'ను హ్యాపీగానే ఆహ్వానిద్దాం!..

---

### హాస్టల్ విద్యార్థుల

# డైట్‌చార్జీలు పెంచాలి

**ధర్నాందోళనలో దళిత సంఘర్షణ సమితి నాయకులు**




హాస్టళ్ళల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే డైట్‌చార్జీలు చాలా స్వల్పంగా ఉన్నాయని, ప్రభుత్వం పరిశీలించి వెంటనే డైట్‌చార్జీలను పెంచాలని కోరుతూ నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద ఈనెల 27న దళిత సంఘర్షణ సమితి నాయకుడు ఎస్.మల్లి ఆధ్వర్యంలో ధర్నాందోళన నిర్వహించారు. జైళ్ళలో ఉండే ఖైదీల కన్నా హాస్టళ్లలో చదువుకునే విద్యార్థుల భోజన ఖర్చులకు ప్రభుత్వం తక్కువ మొత్తం ఇస్తుండడం దారుణమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఖైదీలకు రోజుకు 200 రూపాయల దాకా భోజనఖర్చులను భరాయిస్తున్న ప్రభుత్వం... విద్యార్థులకు మాత్రం 46 రూపాయలే అందజేస్తుండడం అన్యాయమని, ఇంత స్వల్పమొత్తంతో మూడుపూటలా ఎలా భోజనం పెట్టగలమో ప్రభుత్వమే ఆలోచించాలని నాయకులు పేర్కొన్నారు. రోజురోజుకీ కూరగాయలు, ఆకుకూరల ధరలు భారీగా పెరుగుతున్న నేటి పరిస్థితుల్లో హాస్టళ్ళలో చదువుకుంటున్న పేదవిద్యార్థులకు సరైన ఆహారం అందించలేక వార్డెన్లు సతమతమవుతున్నారని వారు తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించి పేద విద్యార్థులకు సరైన భోజనం పెట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# బీచ్‌లను పాడుచేయవద్దు




జిల్లాలో ప్రసిద్ధమైన మైపాడు బీచ్, తూపిలిపాళెం బీచ్, కోడూరు బీచ్ వంటి వాటిని చూస్తుంటే ఎక్కడ చూసినా చెత్తాచెదారం కనిపిస్తోంది. ఎంతో ఆహ్లాదకరమైన బీచ్‌ల వద్దకు వచ్చి సంతోషంగా కేరింతలు కొడుతూ సముద్రస్నానాలు చేసే పర్యాటకులు తాము తిన్న ఆహార పదార్థాల ప్యాకెట్లను, తాగిన నీళ్ళ సీసాలు, తదితర ప్లాస్టిక్ వ్యర్థాలను అక్కడే పారేసి పోతున్నారు. అవి చిన్నగా గాలికి సముద్రంలో కలిసిపోయి అంతా కలుషితమయిపోతున్నాయి. చెత్తనంతా నిర్ణీత పద్ధతిలో చెత్తకుండీల్లో వేయడం కూడా ఒకరు చెప్పాల్సా?... ఆ మాత్రం విచక్షణ కూడా మనకు లేదా?.. మనం తినగా మిగిలిన చెత్తనంతా ఎక్కడంటే అక్కడ పారేస్తే ఎంత దుర్గంధమో తెలిసిందే కదా!..అందుకే మన ప్రధాని మోడీ 'పునీత్ సాగర్ అభియాన్' పేరుతో సాగరతీరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకుంటుండాలని పిలుపునిచ్చారు. ఆ పిలుపును అందిపుచ్చుకుని ఎన్‌సిసి క్యాడెట్లు, పలు కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల వారు ఎంతెంతో దూరం నుంచి వచ్చి సాగర తీరాలను శుభ్రం చేస్తున్నారు కూడా. అయినా ఎవరో తిన్న చెత్తాచెదారాన్ని, తాగిపారేసిన సీసాల్ని ఇతరులువచ్చి శుభ్రం చేయాల్సా?.. మనకు మనమే కాస్తంత శ్రద్ధ తీసుకుని చెత్తను ఒకచోట వేస్తే సరిపోతుంది కదా!.. సాగర తీర ప్రాంతాల్లో ఉన్న గ్రామపెద్దలు, అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలి. ఎక్కడైతే పర్యాటకులు ఎక్కువగా వస్తుంటారో ఆ ప్రాంతాల్లో అక్కడక్కడా అందరికీ అందుబాటులో ఉండేవిధంగా పెద్ద పెద్ద డస్ట్‌బిన్‌లను ఏర్పాటుచేయాలి. ఆ డస్ట్‌బిన్‌లలో చెత్తను క్రమం తప్పకుండా తీసేసేందుకు ఏర్పాట్లు చేయాలి. ఎవరూ చెత్తాచెదారాన్ని ఎక్కడంటే అక్కడ వేయరాదంటూ బోర్డులు పెట్టాలి. బీచ్‌లను ప్రతిరోజూ అధికారులు ఒకరైనా వచ్చి పర్యవేక్షిస్తుంటే ఇంకా మంచిది. ముఖ్యంగా పోలీసులు ఒకరిద్దరికి తీరప్రాంతాల్లో డ్యూటీ వేస్తే వారైనా క్రమశిక్షణతో పరిస్థితుల్ని పర్యవేక్షిస్తుంటారు. బీచ్‌లు గబ్బుకొట్టి పోకుండా వారైనా కాపాడతారు. ఉన్న తాధికారులు ఆలోచించాలి మరి!...

*బి.ఎస్ కావేరి,* **తోటపల్లిగూడూరు.**

# చలికి వణుకుతున్న వృద్ధులను ఆదుకోవాలి

ఈ చలికాలం గతంలో కంటే ఎక్కువ తీవ్రంగా ఉంటోంది. సాయంత్రం నుంచే చలి వణికిస్తోంది. దీంతో రోడ్ల పక్క చిన్న చిన్న గుడిశెల్లో నివాసాలున్న నిరుపేదలు, నిరాశ్రయులు, భిక్షాటన చేసుకుని బతికేవారు ఎంతోమంది దీనులు రాత్రివేళల్లో ఏ రోడ్డుపక్కనో, గుడులు గోపురాల పక్కనో, ప్రార్థనామందిరాల వద్దనో చలికి వణుకుతూ వట్టినేల మీదనే పడుకుంటున్నారు. వారు పడే బాధలు వర్ణనాతీతం. చలిని తట్టుకునేందుకు కనీసం దుప్పటి కూడా లేక చలికి వణుకుతూ నిద్రలేని రాత్రులు గడిపే యాచకులు, నిరుపేదలు మనచుట్టూ ఎందరో ఉన్నారు. ఏ ఒక్కరూ అన్నీ చేయలేరు. ఎవరి వంతు వారు చేయగలిగితే చాలు. ఆర్థికంగా ఇబ్బందులు లేనివారు నిరుపేదలైన ఓ పదిమందికి దుప్పట్లు ఇచ్చినా మేలు.. కనీసం ఆయా ప్రాంతాల్లో స్వచ్ఛంధసంస్థలు, మానవతామూర్తులు, దాతలు ఈ కష్టసమయంలో ఆ నిరుపేదలను, వృద్ధులను ఆదుకోవాలని ప్రార్థన. శరీరం సహకరించక వయోభారంతో ఉన్న సాటి మనుషులకు ఆమాత్రం సాయం చేయగలిగితే అంతకన్నా పుణ్యం ఇంకేముంటుంది?.. అసహాయులకు చేతనైనంత సాయం చేయడం కనీస మానవతా ధర్మం కూడా!..

– *కె. శేషసాయి,* **నెల్లూరు.**

# రాఘవేంద్రశెట్టికి.. ఉత్తమ వాకర్స్ గవర్నర్ అవార్డు

కరోనా తీవ్రంగా ఉన్న సమయంలో వాకర్స్ ఫౌండేషన్ ట్రస్ట్‌కి 9,45,000 నిధిని సమకూర్చి, వాకర్స్ సంఘం ద్వారా విశిష్టసేవలందిస్తున్న రాఘవేంద్రశెట్టి 2020 సంవత్సరానికి ఉత్తమ వాకర్స్ గవర్నర్‌గా అవార్డు సాధించారు. ఇటీవల విజయవాడలో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. వాకర్స్ 2022 ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.వి సుబ్బారెడ్డి, క్యాబినెట్ సెక్రటరీ నలుబోలు బలరామయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.



అవార్డునందుకుంటున్న రాఘవేంద్రశెట్టి

# తిక్కన పుట్టిన గడ్డకు.. మహర్దశ రానుంది



- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చొరవతో పాటూరులో తిక్కన స్మారక కేంద్రం ఏర్పాటుకు పరిశీలనలు
- ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్

**శ్రీ హరిహరనాథుని స్మరణతో దీక్షబూని, మహాభారతాన్ని సర్వస్వతంత్రంగా అద్వితీయమైన రీతిలో ఆంధ్రీకరించి తెలుగుతల్లికి కంఠాభరణంగా సమర్పించిన మహాకవి.. కవిబ్రహ్మ తిక్కన సోమయాజి నడయాడిన పాటూరు గ్రామానికి ఇన్నాళ్ళకి.. ఇన్నేళ్ళకి మహర్దశ రాబోతోంది. స్వయంగా భారత ఉప రాష్ట్రపతి, మన నెల్లూరీయులైన ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ విషయంపై చొరవ తీసుకోవడం ఈ సీమ అదృష్టమనే చెప్పవచ్చు. ఇది నెల్లూరీయుల చిరకాల స్వప్నం కూడా. తిక్కన స్మారకంగా ఏదైనా చేయాలని ఎంతోకాలం నుంచి అందరూ అనుకుంటున్నదే. అయితే, ఏళ్ళు గడిచిపోతున్నా మహాకవి తిక్కన పేరుతో ఘనంగా చెప్పుకోదగ్గ స్మారకకేంద్రం ఏర్పాటు ఏదీ ఆచరణలోకి రాకపోవడం దురదృష్టకరం. ఈ నేపథ్యంలో తిక్కన జన్మించిన పాటూరును పరిశీలించాల్సిందిగా ఇటీవల ఢిల్లీ నుంచి కేంద్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ తాడేపల్లి సత్యనారాయణను పాటూరుకు పంపించడం, ఆయన పాటూరులో పర్యటించడం కూడా జరిగాయి. అనుకున్నవన్నీ అనుకున్నట్లు జరిగితే ఉప రాష్ట్రపతి పుణ్యమా అంటూ పాటూరుకు త్వరలోనే దేశవ్యాప్తంగా ఘనకీర్తి చేకూరుతుందని అనుకోవచ్చు.**

మహాకవి తిక్కన నెల్లూరు పెన్నానది ఆవలి ఒడ్డున ఉన్న పాటూరు గ్రామంలో జన్మించారు. 13వ శతాబ్దిలో నెల్లూరుసీమను పరిపాలించిన మనుమసిద్ధి మహారాజు కొలువులో ఆయన అమాత్యులుగా (మంత్రిగా) ఉండేవారు. తిక్కన పుట్టింది సుమారు 1210 ప్రాంతంలో ఉండవచ్చని చరిత్రకారుల అభిప్రాయం. మహాసారస్వతవేత్త, తెలుగు సంస్కృతభాషల్లో ఎనలేని పాండిత్యం ఉన్న తిక్కన పాటూరులో నివసించేవారు. ఇంటిపేరు 'కొట్టరువు' వారు. అయితే, పాటూరులో నివసించడం వల్ల పాటూరు నివాసిగా తిక్కన సుప్రసిద్ధులు. నేటికీ పాటూరులో తిక్కన పూజలు చేసిన సిద్ధేశ్వరాలయం, ఆయన స్నానమాచరించిన బావి అక్కడ ఉన్నాయి. ఆ ఆలయంలో పూజలు చేసి, నేరుగా పెన్నానదిని దాటుకుని వచ్చి నెల్లూరులోని శ్రీరంగనాథస్వామి దేవస్థానం సమీపంలో పెన్న ఒడ్డున భారతాన్ని ఆంధ్రీకరించారు. వేదవ్యాస మహర్షి సంస్కృతంలో రచించిన లక్ష శ్లోకాల జయభారతాన్ని మహాకవి తిక్కన 'మహాభారతం'గా తెలుగులోకి అనువదించి తెలుగుభాషకు ఎనలేని కీర్తిని తెచ్చారు. అరివీర భయంకరుడైన ఖడ్గతిక్కన ఈ కవితిక్కనకు స్వయానా పెదతండ్రి కుమారుడే. వీరిరువురూ ఆ కాలంలో మనుమసిద్ధి మహారాజు కొలువులో ఉంటూ సింహపురిసీమను, ప్రజలను కంటికి రెప్పలా కాపాడేవారు. భారతంలోని విరాటపర్వం మొదలుకొని పదిహేను పర్వాలను మహాకవి తిక్కన తెనిగించి హరిహరనాథునికి అంకితం చేశారు. ప్రపంచ సారస్వతంలోనే అమేయమైన కీర్తిని సముపార్జించుకున్న గ్రంథంగా మహాభారతం ప్రసిద్ధి. అంతటి బృహత్తరమైన మహాభారత ఇతిహాసాన్ని ఆంధ్రీకరించి కవిబ్రహ్మ తిక్కన తెలుగుభాషకు, తద్వారా నెల్లూరుసీమకు విశ్వవిఖ్యాతిని ఆర్జించిపెట్టారు. అలాంటి మహనీయునికి కృతజ్ఞతగా శాశ్వత ప్రాతిపదికపై స్మారకచిహ్నం, లేదా స్మారక కేంద్రం ఇంతకాలంగా లేకపోవడం నెల్లూరుసీమకే ఒక పెద్ద లోటు. ఈ నేపథ్యంలో ఉప రాష్ట్రపతి ఈ విషయంపై దృష్టి కేంద్రీకరించడం, కేంద్ర సాంస్కృతిక కమిటీ డైరెక్టర్ డాక్టర్ తాడేపల్లిని పాటూరుకు పంపించడంతో నెల్లూరీయులకు, ప్రత్యేకించి తిక్కన అభిమానులకు, తెలుగు సారస్వతాభిమానులందరికీ ఎనలేని సంతోషం కలిగించింది. డాక్టర్ తాడేపల్లి ఈనెల 23న పాటూరును సందర్శించి, తిక్కన తిరు గాడిన ప్రాంతాలన్నిటినీ కలియదిరిగారు. స్థానికులతో కలసి అక్కడి విశేషాలను తెలుసుకున్నారు.

## దేశం గర్వించదగిన మహనీయుడు తిక్కన


తిక్కన మహాకవి దేశం గర్వించదగిన మహనీయుడని, అందుకే 'అజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా దేశంలో జాతిని ప్రభావితం చేసిన మహనీయుల చరితలను భావితరాలకు అందజేసే బృహత్తర కార్యక్రమంలో భాగంగా, అద్వితీయమైన రీతిలో మహాభారతాన్ని రచించిన మహాకవి తిక్కన పుట్టిన కోవూరు మండలంలోని పాటూరు గ్రామంలో భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచనల మేరకు ఈ ప్రాంతాన్ని పరిశీలించడం జరిగిందని డాక్టర్ తాడేపల్లి ఈ సందర్భంగా విలేకర్లకు తెలిపారు. తిక్కన స్మారకంగా ఇక్కడ తిక్కన వినియోగించిన వస్తువులు, రచనలతో మ్యూజియంను, గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటుచేయాలనే ఆలోచన ఉన్నట్లు ఆయన చెప్పారు. తిక్కన తెలుగుభాషకు చేసిన సేవలు అజరామరమని, తిక్కన తెలుగువారి సంపద అని అన్నారు. తిక్కన వంశీయులు ఉదారస్వభావంతో ఈ ప్రాంతాన్ని ప్రభుత్వానికి అందజేస్తే అందులో తిక్కన స్మారక కేంద్రం ఏర్పాటు చేసేందుకు, పర్యాటకశాఖ ద్వారా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు త్వరలోనే ఈ విషయాలను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కవిబ్రహ్మ తిక్కన గొప్పదనాన్ని భావితరాల వారందరికీ తెలిసేవిధంగా ఈ కేంద్రం నిర్మించాలనే తలంపుతో ఉన్నట్లు చెప్పారు. త్వరలోనే కేంద్రప్రభుత్వం తరఫున ఒక అధ్యయన బృందాన్ని కూడా పంపి అందుకు ఏమేం చేస్తే బావుంటుందో పరిశీలించి ప్రతిపాదనలు రూపొందిస్తామన్నారు.



పాటూరులో మహాకవి తిక్కన తిరుగాడిన ప్రాంతాలను సందర్శిస్తున్న కేంద్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ తాడేపల్లి సత్యనారాయణ







## ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా
# కోట సూర్యనారాయణ
### మరో ముగ్గురు నెల్లూరీయులకు సముచిత పదవులు



ఆర్యవైశ్య మహాసభ నాయకులను సత్కరిస్తున్న నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, ఆర్టీఐ కమిషనర్ రేపాల శ్రీనివాస్

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభలో నలుగురు నెల్లూరీయులకు సముచిత పదవులు లభించాయి. ఇటీవల విజయవాడలో జరిగిన సర్వ సభ్య సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కోట సూర్యనారాయణకు పదవి లభించగా, కార్యదర్శి–ప్రాజెక్టు ఛైర్మెన్‌గా నెల్లూరుకు చెందిన చలువాది వెంకటశరత్‌కుమార్, కార్యదర్శిగా శ్రీరాం సురేష్, కార్యవర్గ సభ్యులుగా గాదంశెట్టి గోపాల్ నియమితులు కావడంతో నెల్లూరులోని ఆర్యవైశ్యసంఘాల్లో సంతోషం వ్యక్తమైంది. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, ప్రధాన కార్యదర్శి సాదు ప్రతాప్‌కుమార్ ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం వారిని ముక్కాల ద్వారకానాథ్ ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సన్మానించారు. ఆర్టీఐ కమిషనర్ రేపాల శ్రీనివాస్, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మెన్ కుప్పం ప్రసాద్, మహాసభ ప్రధాన కార్యదర్శి సాదు ప్రతాప్‌కుమార్, విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ళ విద్యాధర్‌రావు, రాష్ట్రంలోని అనేకమంది ఆర్యవైశ్యసంఘాల వారు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## టూరిజంపై స్వప్నకు డాక్టరేట్



నెల్లూరుకు చెందిన బెల్లం శ్రీనివాసులు – సుభాషిణిల కుమార్తె స్వప్నకు విక్రమసింహపురి విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. టూరిజం విభాగంలో డాక్టర్ మైలా త్యాగరాజు పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ ఫెర్స్ అండ్ ఫెస్టివల్స్ ఇన్ ప్రమోటింగ్ కల్చర్ టూరిజం ఇన్ ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ' అనే అంశంపై స్వప్న పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈనెల 28న వివిఎస్‌యు వీసీ ఆచార్య సుందరవల్లి, రిజిస్ట్రార్ డా.ఎల్వీ కృష్ణారెడ్డిలను కలిసి ఆమె పుష్పగుచ్ఛం అందించి వారి అభినందనలు అందుకున్నారు.

## కోలాహలంగా అయ్యప్పస్వామి నగరోత్సవం

నెల్లూరు వేదాయపాళెంలో కొలువై ఉన్న శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి మండల పూజలను పురస్కరించుకుని ఈనెల 27న అంగరంగ వైభవంగా నగరోత్సవం నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా స్వామివారికి శోభాయమానంగా పుష్పాలంకారం చేసి విశిష్టపూజలు చేపట్టారు. సంప్రదాయానుసారం స్వామివారి నగరోత్సవం మేళతాళాల నడుమ, కేరళ వాద్యబృందాల మధ్య కోలాహలంగా సాగుతూ అయ్యప్పస్వామి దేవాలయం వద్ద నుంచి నగరంలోని నిప్పో కూడలి, ఆర్టీసీ బస్టాండ్, ఆత్మకూరు బస్టాండ్ సెంటర్, స్టోన్‌హౌస్‌పేటల మీదుగా నవాబుపేట లోని శివాలయం వద్దకు చేరుకుంది. అయ్యప్పస్వామి సేవా సమాజం నిర్వాహకులు శేషగిరిరావు, వెంకటరత్నం, రత్నయ్యల పర్యవేక్షణలో ఈ వేడుక కన్నులపండువగా జరిగింది. అనంతరం అయ్యప్ప భక్తులకు మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, రాజేశ్వరి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు.

# నెల్లూరు కబుర్లు

## వేమిరెడ్డి దంపతులతో మేయర్ దంపతులు



నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి–జయవర్ధన్ దంపతులు ఈనెల 28న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులను మేయర్ దంపతులు దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఇటీవలే నగర మేయర్‌గా ఎన్నికైన స్రవంతిని వేమిరెడ్డి దంపతులు అభినందించి ఆశీర్వదించారు. నగర కార్పొరేషన్‌లో బాధ్యతాయుతంగా అందరితో సఖ్యతగా ఉంటూ నగరాభివృద్ధి కార్యక్రమాలను శ్రద్ధతో నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నామని ఈ సందర్భంగా విపిఆర్ వారికి చెప్పారు.

## ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్ళ సస్పెండ్

ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్ళ ప్రవర్తన సరిగా లేదని తెలిసి వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు వారిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఓ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించాడంటూ వచ్చిన ఫిర్యాదును విచారించి ఒక హెడ్‌కానిస్టేబుల్‌ను, ఓ కేసుకు సంబంధించిన రికార్డులు మాయం చేసేందుకు ప్రయత్నించిన మరో హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. చిట్టమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలిక వ్యవహారంలో హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్‌పై, దిశ పోలీస్‌స్టేషన్ పరిధిలో రికార్డులను మాయం చేసి, ఉన్నతాధికారులు వస్తున్నారని తెలిసి ఒక హోంగార్డు సాయంతో వాటిని మళ్ళీ యథాతథంగా పెట్టారన్న విషయంలో హెడ్‌కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యంపై ఎస్పీ సస్పెన్షన్ వేటు వేశారు. ఆ హోంగార్డును విఆర్‌కు పిలిపించారు. పోలీసు సిబ్బంది బాధ్యతలేకుండా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

### పలువురు ఎస్ఐల బదిలీ :

జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు ఈనెల 28న ఉత్తర్వులు జారీచేశారు. శ్రీహరికోట పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఎం.రమ్యను వేదాయపాళెం స్టేషన్‌కు బదిలీ చేసి, ఆమె స్థానంలో గూడూరు 1వ పట్టణ పిఎస్‌లో ఉన్న రోజాలతను నియమించారు. అదేవిధంగా చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఎస్.ఆనందభాస్కర్‌ను విడవలూరుకు, అక్కడ పనిచేస్తున్న బి.మహేంద్రను చిన్నబజారు స్టేషన్‌కు బదిలీ చేశారు. విఆర్‌లో ఉన్న వై.రంగనాథగౌడ్‌ను సౌత్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నియమించి, వారంతా వెంటనే బాధ్యతలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు.

## కారుణ్య నియామకాలు

నెల్లూరు నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో ఈనెల 27న జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు పలువురికి కారుణ్య నియామకపు పత్రాలు ఇచ్చారు. మృతి చెందిన ఉద్యోగుల వారసులకు వాటిని అందజేశారు. వారిలో మోహిత్‌బాబును స్త్రీ శిశు సంక్షేమ శాఖకు జూనియర్ అసిస్టెంట్‌గా, జయకృష్ణను రిజిస్ట్రేషన్ శాఖకు జూనియర్ అసిస్టెంట్‌గా, ఎం భానుప్రకాష్‌ను జూనియర్ అసిస్టెంట్‌గా, సుభానీని ఆఫీస్ సబార్డినేట్‌గా ఆడిట్ శాఖకు కేటాయించారు. ప్రతి ఒక్కరూ ఉద్యోగ విధులు బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నూతనంగా నియామక పత్రాలు పొందిన ఉద్యోగులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్లు హరేందిరప్రసాద్, గణేష్‌కుమార్, విదేహ్‌ఖరే, డిఆర్‌ఓ చిన్న ఓబులేసు, ఏ.ఓ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



## 'వాత్సల్య' విద్యార్థిని చదువుకు..
# నేత్రవైద్యుని చేయూత
### లక్షా 23వేలు అందించిన డాక్టర్ గోపాలకృష్ణ

నెల్లూరు మాదరన్ ఐ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డా. గోపాలకృష్ణ వాత్సల్య శరణాలయంలో ఒక బాలిక విద్యకి గాను లక్షా 23 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఇంజనీరింగ్ చేరేందుకు ఆ విద్యార్థిని చదువుకు సరిపడా ఖర్చులకు వారు ఈ సహాయం అందజేశారు. డా. గోపాలకృష్ణ, ఆయన సతీమణి అంజని లక్ష్మీ రాఘవకుమారి, వారి కుమారుడు అనిరుధ్ కృష్ణతో కలిసి స్థానిక వాత్సల్య నిరాధార బాలబాలికల ఆశ్రమానికి వచ్చి, నిర్వాహకులకు విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక నిరుపేద విద్యార్థినికి మంచి విద్యని అందించడం ద్వారా వారికి మంచి భవిష్యత్తును ఇవ్వడమే కాకుండా, ఈ సమాజానికి మంచి చేయగలుగుతామని అందుకే తమ వంతు సామాజిక బాధ్యతగా ఈ విరాళం అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ దంపతులకు జనహిత వాత్సల్య సంస్థ కార్యదర్శి జివి సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాత్సల్య సంయుక్త కార్యదర్శి టివిఎస్ దుర్గాప్రసాద్, ఏ.ప్రకాష్‌రావు, గిరి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి
### – పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో డిసిసి నేత చేవూరు



కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 28న కాంగ్రెస్ పార్టీ 137వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నెల్లూరులోని ఇందిరా భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశాన్ని శక్తివంతంగా నిలిపింది కాంగ్రెసేనన్నారు. కాంగ్రెస్ పాలనలోనే దేశంలోని విద్య, వ్యవసాయం, పరిశ్రమలు..ఇలా అన్ని రంగాలు పురోభివృద్ధి సాధించాయని, నేటికీ కాంగ్రెస్ అందించిన అనేక సంక్షేమపథకాలే ప్రజలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతే రాజు అనే నినాదంతో ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు రుణమాఫీ చేసి, అన్నదాతలకు మేలు చేసే పథకాలెన్నో చేపట్టింది కూడా కాంగ్రెస్సే అన్నారు. తెల్లదొరల పాలన నుంచి దేశాన్ని కాపాడుకున్న విధంగానే ఇప్పుడు బిజెపి నిరంకుశ పాలన నుంచి దేశాన్ని కాపాడుకోవాలన్నారు. బిజెపి, వైసిపిల విధానాలకు ప్రజలు విసిగిపోయారని, 2024లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, రాహుల్‌గాంధీ ప్రధాని కావడం తథ్యమని అన్నారు. తొలుత, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కొండా అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన కాంగ్రెస్‌పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సీవి శేషారెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నాయకులు వెంకట్రావు, షేక్ ఫయాజ్, దుద్దుకూరి రమేష్‌నాయుడు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ అల్లా ఉద్దీన్, షేక్ హుస్సేన్‌బాషా, సుధీర్‌బాబు, మోహన్‌రావు, రాజగోపాల్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, కిషోర్‌బాబు, మల్లికార్జునరెడ్డి, మోహన్, మధు, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## రోగులకు 'అమ్మా యూత్' సాయం



నెల్లూరులోని అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 26న నగరంలోని పెద్దాసుపత్రిలోని రోగులకు ఆహారపొట్లాలను అందజేసి తమ సేవాభావం చాటుకున్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, సభ్యులు శరత్, వంశీ, ప్రణీత్, అహ్మద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.




## జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారి ఆలయంలో..

# దాతల విరాళాలతో పలు నిర్మాణాలు

## - ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రసన్న



జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ క్షేత్రంలో శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా ఈనెల 24న కొత్తగా దాతల ద్వారా నిర్మించిన విజయద్వారం, రజతగిరి వసతి గదులు (మొదటి అంతస్తు), కళావేదిక, శ్రీ తారకేశ్వరస్వామి వారి దేవస్థానంలోని సాలాహారం, కళ్యాణ కట్టలను కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రారంభించారు. విజయద్వారానికి దామరమడుగుకు చెందిన బండి లక్ష్మీనరసారెడ్డి-శైలజమ్మ 16 లక్షల రూపాయలు విరాళం ఇవ్వగా, రజతగిరి వసతిగదుల నిర్మాణానికి స్వర్గీయ బొల్లినేని చెంచయ్యనాయుడు జ్ఞాపకార్థం బొల్లినేని హజరత్‌నాయుడు-అరుణమ్మలు 20 లక్షల రూపాయలు, సాలాహారానికి దామరమడుగుకు చెందిన బొబ్బా రమణారెడ్డి-వెంకటలక్ష్మిలు, తెలంగాణలోని కొమురంభీమ్ జిల్లా వాంకిడి గ్రామానికి చెందిన చిడిపూడి గోవిందరెడ్డి-వాణి, బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన స్వర్గీయ దర్శి లక్ష్మీనరసయ్య జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని పద్మావతి, కుమారుడు దర్శి బాలనరసింహారావు-వెంకటశిరీషలు కలసి 6 లక్షల రూపాయలు, కల్యాణకట్టకు నెల్లూరుకు చెందిన దాతలు జి.కామాక్షయ్య - కవిత 15లక్షలు, కల్యాణవేదికకు నెల్లూరుకు చెందిన శంకర్‌రెడ్డి-ప్రసన్మితిలు 12 లక్షల రూపాయల వంతున విరాళంగా ఇచ్చినట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. తొలుత, ఈ ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిని దేవస్థానం ఛైర్మెన్ చీమల రమేష్‌బాబు, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు సాదరంగా స్వాగతించి స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అర్చకులు, దాతలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## డబ్బు శాశ్వతం కాదు..సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి

### - జన్మభూమిని మరువద్దంటూ దాతలకు ఎమ్మెల్యే ప్రసన్న సూచన

డబ్బు ఎప్పుడూ శాశ్వతం కాదని, మనం సమాజానికి, ప్రజలకు చేసే సేవలే చిరస్థాయిగా నిలుస్తాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. తమకు జన్మనిచ్చిన గ్రామాలను దాతలు, పారిశ్రామికవేత్తలు అభివృద్ధి చేసుకోవాలని, 'మన గ్రామాలు-మన దేవాలయాలు' పేరుతో మన గ్రామాల్లోని దేవాలయాలను మనం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈనెల 26న కోవూరులోని కోదండరామస్వామి దేవస్థానంలో 7 లక్షల రూపాయల వ్యయంతో దాత కాటంరెడ్డి కృష్ణారెడ్డి నిర్మించనున్న మండపం నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రసన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరుకు చెందిన దాత కాటంరెడ్డి కృష్ణారెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం కోవూరు కోదండరామస్వామి దేవాలయం అభివృద్ధికి నిధులిచ్చి సహకరిస్తుండడం అభినందనీయమన్నారు. అదేవిధంగా మాజీ సిడిసి ఛైర్మెన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి కూడా తమ తల్లితండ్రుల జ్ఞాపకార్థం ఈ ఆలయంలో 2లక్షల రూపాయల వ్యయంతో మండపం ముందు వరాండా నిర్మించేందుకు ముందుకురావడం సంతోషకరమన్నారు. డిఏఏబి ఛైర్మెన్ నిరంజన్‌బాబురెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరి చలపతిరావు, పడుగుపాడు సొసైటీ ఛైర్మెన్ మల్లికార్జున్‌రెడ్డి, మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## బాలుడి వైద్యానికి..ఎమ్మెల్యే ప్రసన్న 50వేల సాయం

విడవలూరు మండలంలోని వడ్డిపాళెం గ్రామానికి చెందిన గుంజి అభిలాష్ అనే బాలుడి వైద్యానికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి 50వేల రూపాయల సాయం అందించారు. ఆ బాలుడికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో తల్లిదండ్రుల ద్వారా విషయం తెలుసుకున్న ప్రసన్న తమ తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా ఆ మొత్తాన్ని అందజేశారు. వైకాపా నేత కోడూరు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## వాహనశాలను ప్రారంభించిన.. ఆనం అరుణమ్మ



నెల్లూరు జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తమ స్వగ్రామమైన చింతారెడ్డిపాళెంలో వాహనశాలను ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల సహకారంతో అక్కడున్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం ప్రాంగణంలో నూతనంగా వాహనశాలను నిర్మించారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కేంద్ర సహకార బ్యాంకు మాజీఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డిలు ఆ వాహనశాలకు ఇటీవల ప్రారంభోత్సవం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలకు శ్రీసిటీ పరిశ్రమ వితరణ



వంట పాత్రలు వితరణ చేస్తున్న ఎంసిఎన్ఎస్ యాజమాన్యం

శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో స్థానిక మత్తేరిమిట్ట, సిద్ధమ అగ్రహారం ప్రభుత్వ పాఠశాలలకు శ్రీసిటీలోని ఎంసిఎన్ఎస్ పాలిరిథెన్స్ పరిశ్రమ యాజమాన్యం, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారీ కోసం వంట పాత్రలను వితరణగా ఇచ్చింది. 23 వేల రూపాయల విలువ చేసే పాత్రలను ఆయా పాఠశాలల వద్ద ప్రధానోపాధ్యాయులకు వాటిని అందచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ సెక్యూరిటీ ఇన్‌చార్జి రమేష్, ఎంసిఎన్ఎస్ పరిశ్రమ హెచ్ఆర్ సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.








# రమణీయం... చిరస్మరణీయం!



సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ మూడు రోజుల పాటు జరిపిన సొంత రాష్ట్ర పర్యటనతో బెజవాడ పులకించి పోయింది. పురివిప్పి నాట్యం చేసింది. అరుదైన దృశ్యాలతో కనువిందు చేసింది. రెండు న్నరేళ్లుగా స్తబ్దుగా ఉన్నట్లుగా ఉన్న బెజవాడ ఒక్కసారిగా తిరిగి జీవం పోసుకుంది.

భారత ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ తొలిసారిగా, కుటుంబ సమేతంగా మూడురోజుల పాటు జరిపిన పర్యటన కొత్త చరిత్రకు చిరస్మరణీయమైన శ్రీకారం చుట్టింది.

2021 డిసెంబర్ 24, 25, 26. మరో నాలుగైదు రోజుల్లో ఈ ఏడాది ముగిసిపోతుందనగా భారత ప్రధాన న్యాయమూర్తి తన మాతృభూమిని సందర్శించారు. తాను చిన్నతనంలో ఆడుతూ పాడుతూ.. ఓనమాలు నేర్చుకున్న సొంతూరుకు వెళ్లారు. అక్కా..., బావా..., పిన్నీ..., బాబాయ్... మామ్మా... అంటూ ఆత్మీయులను, బంధువులను పలకరిస్తూ, కుశలప్రశ్నలు వేస్తూ... తన స్వగ్రామంలో ఓ పూటంతా గడిపారు. గ్రామస్థులు కూడా రమణ దంపతులను అలంకరించిన రథం లాంటి ఎడ్లబండిపై తమ గ్రామంలోకి తోడ్కొని వెళ్లారు. కోటికి ఒక్కరికో..., ఇద్దరికో లభించే ఇంతటి భాగ్యం 'మన రమణ'కు దక్కింది. తాను చదువుకున్న నాగార్జున యూనివర్సిటీకి వెళ్లారు. రాష్ట్రంలోని మొత్తం న్యాయ మూర్తులు, న్యాయాధికారుల సదస్సులో ప్రసంగించారు.






ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు వెళ్లారు. సిద్ధార్థ కాలేజీకి వెళ్లారు. తోటి న్యాయ మూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు గృహాన్ని సందర్శించారు. రోటరీ క్లబ్ సమావేశానికి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వ తేనీటి విందుకు వెళ్లారు. రాజభవన్‌కు వెళ్లి గవర్నర్ ఇచ్చిన తేనీటి విందును స్వీకరించారు.

ఇవన్నీ జస్టిస్ రమణ ఒక్కరే చేయలేదు. సుప్రీం కోర్టును, రెండు రాష్ట్రాల హైకోర్టులను వెంటబెట్టుకు వెళ్లారా అన్నట్టుగా పలువురు న్యాయమూర్తులను వెంటబెట్టుకు వెళ్లారు. ఇది ఒక అరుదైన సన్నివేశం. సర్వోన్నత, ఉన్నత న్యాయస్థానాల న్యాయ మూర్తులు నలుగురితోనూ కలివిడిగా ఉండడానికి అంతగా ఇష్టపడరు. అధికార కార్యక్రమాల్లో అధికారికంగానే పాల్గొని, తిరిగి గూటికి చేరుకుంటుంటారు. న్యాయ వ్యవస్థేతర వ్యక్తులతో (వారు బంధువులైనా సరే) అంటీ ముట్టనట్టుగా... నవ్వితే నోటి ముత్యాలు రాలిపోతాయా అన్నట్టుగా వ్యవహరిస్తుంటారు. వారి 'మైండ్ సెట్' అలా ఉంటుంది.

కానీ, జస్టిస్ రమణ మూడు రోజులపాటు పలువురు న్యాయమూర్తులతో కలిసి, తనవారు అనుకున్న వారితో కలిసి మెలిసి, కలివిడిగా, ఆత్మీయంగా, ఆహ్లాదంగా, ఆనందంగా, నిష్కల్మషంగా గడిపారు.

అయితే ఆయనేమీ సరదాగా..., కాలక్షేపం కోసం పర్యటించలేదు. సహచర న్యాయమూర్తుల ముందు తన దర్పాన్ని ప్రదర్శించడానికి పర్యటించలేదు.

ఎవరికి చేరాల్సిన సందేశాన్ని వారికి మృదువుగా చేరవేశారు. ఎవరికి చేయాల్సిన హితోపదేశాన్ని వారికి సున్నితంగా చేశారు. ప్రభుత్వాలకు స్పష్టం చేయాల్సిన విషయాలను నిర్మొహమాటంగా స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థకు దిశా నిర్దేశం చేశారు. రాజ్యాంగానికి గుండెకాయ వంటి ఆర్టికల్ 21, 19కి భంగం కలిగినప్పుడు మాత్రమే కోర్టులు ప్రభుత్వ నిర్ణయాల్లో జోక్యం చేసుకుంటాయి అని నిష్కర్షగా చెప్పారు. న్యాయమూర్తులు, న్యాయ వ్యవస్థపై మౌఖిక, భౌతిక దాడులు చేసేవారిని ఉపేక్షించడం కరెక్ట్ కాదు అని చెప్పారు.

మాతృమూర్తిని, మాతృ భూమిని, మాతృ భాషను విస్మరించగూడదు అనే సందేశాన్ని చాలా బలంగా చెప్పారు. ఈ సందేశాలన్నీ ఎవరికి చేరాలో వారికి చేరే ఉంటాయి. వీటితో పాటు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు జస్టిస్ రమణ పర్యటన నుంచి పరోక్షంగా గొప్ప నైతిక మద్దతు, ఆశీస్సులు లభించి ఉంటాయి.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే ముఖ్యమంత్రి జగన్ ఈ పర్యటన పట్ల వ్యక్తం చేసిన సుహృద్భావన ఒక్కటే ఒక ఎత్తు.

కుటుంబ సమేతంగా జగన్ ప్రధాన న్యాయమూర్తి దంపతులను మూడుసార్లు కలిశారు. జస్టిస్ రమణ గౌరవార్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇవ్వ తలపెట్టిన తేనీటి విందుకు ఆహ్వానించడానికి ముఖ్యమంత్రి జగన్, కుటుంబ సమేతంగా న్యాయమూర్తి బస చేసిన హోటల్‌కు స్వయంగా వెళ్లారు. దాదాపు గంటసేపు జస్టిస్ రమణ దంపతులతో ఆత్మీయంగా గడిపారు. తరువాత, ఇందిరాగాంధీ స్టేడియంలో ప్రభుత్వం తరఫున ఇచ్చిన విందులో జగన్ దంపతులు ఎంతో ఉల్లాసంగా... ఉత్సాహంగా పాల్గొన్నారు. మళ్ళీ, గవర్నర్ హరిచందన్ ఇచ్చిన తేనీటి విందుకు కూడా ముఖ్యమంత్రి జగన్, తన శ్రీమతి సమేతంగా వెళ్లారు. అందువల్ల కూడా ప్రధాన న్యాయమూర్తి ఆంధ్ర పర్యటన ఆహ్లాదకర భావనలను వెదజల్లింది. ఈ పర్యటనను ఇంత మనోహరంగా రూపుదిద్దిన వారందరికీ చిరస్మరణీయం అయింది. ఇంతటి గౌరవం ఏ న్యాయమూర్తికి గానీ, న్యాయ వ్యవస్థేతర ప్రముఖునికి గానీ లభించి ఉండవు అనడంలో అతిశయోక్తి ఏమీ లేదు.

ఈ పర్యటన అనేక కోణాల్లో చిరస్మరణీయంగా మిగిలి పోతుంది.

1. భారత ప్రధాన న్యాయమూర్తి అమరావతి ప్రాంతాన్ని స్వయంగా సందర్శించారు. (హైకోర్టులో రాజధాని ఏర్పాటుకు సంబంధించి వాద ప్రతివాదనలు జరుగుతున్న సమయంలో)

2. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 19కి భంగం వాటిల్లితే కోర్టులు జోక్యం చేసుకుంటాయని భారత న్యాయవ్యవస్థ పెద్దగా చెప్పారు. ఆయన మాటకు అప్పీల్ లేదు. మరో అభిప్రాయానికి తావు ఉండదు.

3. న్యాయవ్యవస్థను కించపరిచేవారిని ఉపేక్షించవద్దు అనే సందేశం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానానికి అంది ఉంటుంది.

4. ఆంధ్ర హైకోర్టుకు కొత్త న్యాయమూర్తులు రాబోతున్నారని చెప్పారు.

హైకోర్టుకు ఓపెన్‌టాప్ కార్‌లో నిలబడి, ముకుళిత హస్తాలతో, రాజధాని ప్రాంతవాసుల.., విశేషించి మహిళల హర్ష ధ్వానాలు, పూలవర్షంలో నిలువెల్లా తడుస్తూ ప్రయాణించిన తీరు చూస్తున్న వారికి ఇటీవల ప్రధాని కాశీ వీధుల్లో జరిపిన పర్యటన గుర్తుకు వచ్చి ఉంటుంది. మరో ఉదాహరణ కనిపించడం లేదు.

భారత న్యాయవ్యవస్థ ప్రస్థానంలో సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ నూతలపాటి వెంకటరమణ స్థానం చిరస్మరణీయం.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com



మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, గూడూరు ప్రాంత ప్రజానీకానికి
2022 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు
మీ..
వల్లంకొండ వెంకటసుబ్బయ్య
అధ్యక్షులు, చిల్లీస్ మర్చెంట్స్ అసోసియేషన్, గూడూరు.




# గూడూరు డివిజన్ వార్తలు

## తొలిదశలో గుర్తిస్తే..
## క్యాన్సర్‌ను జయించవచ్చు


మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీకృష్ణ

రొమ్ము క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి వైద్యం చేయించుకుంటే పెద్ద ముప్పేమీ ఉండదని ప్రముఖ వైద్యురాలు చెరుకూరు రోహిణి అన్నారు. ఎడతెరిపి లేని దగ్గు లంగ్ క్యాన్సర్‌కు కారణమై ఉండవచ్చని, మంచి అలవాట్లతో ఇటువంటి క్యాన్సర్‌ను దగ్గరకు రాకుండా చూసుకోవచ్చని వివరించారు. మహిళలు వ్యాక్సిన్‌ను మూడు దఫాలుగా తీసుకోవడం వల్ల క్యాన్సర్ బారిన పడకుండా ఉండొచ్చని చెప్పారు. అనంతరం పట్టణ పరిధిలోని చవటపాలెంలో పేదలకు దుస్తుల పంపిణీచేశారు. ఆంధ్ర మహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిలుగా గూడూరు ఆర్డీఓ మురళీకృష్ణ, ప్రముఖ వైద్యురాలు చెరుకూరు రోహిణి పాల్గొన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు నాగసూరు లక్ష్మి, కార్యదర్శి కొండెదల అనిత, విష్ణువందన, స్నేహలతారెడ్డి, జీవనిరెడ్డి పాల్గొన్నారు.

## కనుమూరు జన్మదినాన సేవా కార్యక్రమాలు



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నేత, ప్రముఖ దాత కనుమూరు హరిచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు ఆయన అభిమానులు, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు ఇటీవల గూడూరు పట్టణంలో సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి వేదిక నుంచే హరిచంద్రారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్ఎంజి స్కూల్, గాంధీనగర్‌తో పాటు పలు వృద్ధాశ్రమాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

## మౌలిక వసతులు కల్పించండి


శ్యామ్‌యాదవ్

గూడూరు రైల్వేజంక్షన్‌లో మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ రైల్వే డివిజన్ డిఆర్‌యుసిసి మెంబర్ డాక్టర్ బి.శ్యామ్‌యాదవ్ సభ్యులను కోరారు. వర్చువల్ విధానంలో నిర్వహించిన డిఆర్‌యుసిసి సభ్యుల సమావేశంలో పలు సమస్యలపై శ్యామ్‌యాదవ్ డిఆర్ఎం శివేంద్రమోహన్, డిసిఎం రాజేంద్రప్రసాద్‌లకు ఇటీవల విన్నవించారు.


LIC
నెల్లూరు డివిజన్ ఎల్ఐసి అధికారులకు, గూడూరు బ్రాంచి మేనేజర్ మరియు స్టాఫ్‌కు, డెవలప్‌మెంట్ ఆఫీసర్లకు, ఏజంటుమిత్రులకు, పాలసీదారులకు, పట్టణశ్రేయోభిలాషులకు మరియు లయన్ మిత్రులకు
2022 ఆంగ్ల నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు
మీ అందరి జీవితాలలో సంక్రాంతి వెలుగులు నింపాలని కోరుతూ...

మీ... Ln. మల్లెమాల మురళీరెడ్డి
Dist., Chairman(Girls Education)
Rtd., LIC Development Officer, Gudur Branch.

శుభాకాంక్షలు

గూడూరు నియోజకవర్గ ప్రజలకు,
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు
క్రిస్టమస్, 2022 నూతన సంవత్సర
మరియు సంక్రాంతి శుభాకాంక్షలు.
బత్తిని విజయకుమార్
వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గూడూరు.

# సిపిఐ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



సిపిఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు సిహెచ్ ప్రభాకర్, రామారాజు తదితరులు

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 97వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఈనెల 26న కోవూరులో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ 1925లో ఆవిర్భవించినప్పటి నుంచి సిపిఐ పేదల అభ్యున్నతి కోసం ఎన్నో ఉద్యమాలు నడిపిందన్నారు. ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. నేటికీ తమ పార్టీ అలుపెరగకుండా ఉద్యమాలను నిర్వహిస్తూనే ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని, వాటిని అందరూ ఎదుర్కోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తొలుత సిపిఐ జెండాను ఆవిష్కరించారు. సిపిఐ నాయకులు రామరాజు, కోవూరు మండల కార్యదర్శి మున్వర్, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, యజ్దానీ, విజయకుమార్, శంకర్, షేక్ బాబు, ప్రశాంత్ పాల్గొన్నారు.

### డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో..

# 9 నుంచి సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 9, 10, 11 తేదీల్లో సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నట్లు ఆ కార్యక్రమాల కన్వీనర్ ఎం.పుల్లయ్య చెప్పారు. ఈనెల 26న ఆయన విజ్ఞానకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ తొలిరోజు చిల్డ్రన్స్‌పార్కు నుంచి జానపద కళాకారుల ప్రదర్శన నిర్వహిస్తామని, దీనిని కలెక్టర్ చక్రధర్‌బాబు ప్రారంభిస్తారని, ఆ తర్వాత ముగ్గులపోటీలు, గొబ్బిపాటలు ఉంటాయన్నారు. రెండవరోజు శాస్త్రీయ, జానపద, పాశ్చాత్య నృత్యపోటీలుంటాయని, ఆరోజు సాయంత్రం 6 గంటలకు సినీ నృత్య దర్శకుడు జానీమాస్టర్ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని, మూడోరోజు మధ్యాహ్నం 3గంటలకు జానపద కళారూపాల ప్రదర్శన, పద్యనాటకాలు, గ్రూప్‌డాన్స్, మ్యాజిక్, మిమిక్రీ, హాస్యవల్లరి కార్యక్రమాలుంటాయని, ముఖ్యఅతిథులుగా జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు, సినీనటుడు రఘుబాబు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాటలు, డాన్స్ పోటీల్లో పాల్గొనేవారు జనవరి 6వ తేదీలోగా డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు చలపతి, సతీష్, మాదాల రాము, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### అయ్యప్పస్వామికి

# విశేష పూజలు

జలదంకిలోని శ్రీ జానకీ రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామికి ఇటీవల పద్దెనిమిది మెట్ల పడిపూజను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక మందిరంలో అయ్యప్పస్వామి, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యస్వామిలను కొలువుదీర్చి శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం స్వామివార్లకు వాహనసేవలు, గ్రామోత్సవం కన్నులపండువగా చేపట్టారు. పులి వాహనంలో అయ్యప్పస్వామి ఊరేగింపు అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ కొత్త కార్యవర్గం

స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) జిల్లా నూతన కమిటీని ఉదయగిరిలో ఇటీవల జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సనత్, కార్యదర్శిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా విష్ణు, సాదిక్, మునిషా, సహాయ కార్యదర్శిగా తేజకృష్ణప్రసాద్ ఎన్నికయ్యారు.. సభ్యులుగా చంద్ర, కిరణ్, పావని, చిన్ని, గణేష్, సుకుమార్, సంతోష్, వైష్ణవి, బాలాజీ, రేవంత్, అరీఫ్ ఎన్నికయ్యారు.

# ఓటిఎస్ పేరుతో దోపిడీ

**ధ్వజమెత్తిన టీడీపీ**



ఓటిఎస్‌పై ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

ఓటిఎస్ (ఒన్ టైమ్ సెటిల్‌మెంట్) పేరుతో వైకాపా ప్రభుత్వం పేదలను నిలువునా దోచుకుంటోందని, ఓటిఎస్ వసూళ్ళు పేదల మెడలకు ఉరితాళ్ళుగా మారుతున్నాయని విమర్శిస్తూ నెల్లూరులోని టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఓటిఎస్‌కు వ్యతిరేకంగా ఈనెల 27న స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద నుంచి కలెక్టరేట్ దాకా ప్రదర్శన చేపట్టారు. ఈ ఆందోళనలో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం టిడిపి అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఓటిఎస్ పేరుతో గ్రామాల్లో అధికారులు పేదల నుంచి డబ్బు వసూళ్ళు చేస్తున్నారని, ఎప్పుడో 40 ఏళ్ల కిందట నిర్మించిన ఇళ్ళకు ఇప్పుడెందుకు నగదు చెల్లించాలని ప్రశ్నించారు. ఎవరూ ఒక్క రూపాయి కూడా చెల్లించవద్దని, టిడిపి అధికారంలోకి వచ్చాక ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయిస్తామని అన్నారు. అనంతరం 'స్పందన' కార్యక్రమంలో అర్జీలందుకుంటున్న కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో టిడిపి నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, గూడూరు, ఉదయగిరి వెంకటగిరి నియోజకవర్గాల టిడిపి ఇన్‌చార్జులు పాశం సునీల్ కుమార్, బొల్లినేని వెంకటరామారావు, కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, జడ్పీ మాజీ ఛైర్మెన్ చెంచలబాబుయాదవ్, టిడిపి మహిళా నాయకురాలు తాళ్ళపాక అనూరాధ పాల్గొన్నారు.

### విలీనం పేరుతో...

# పాఠశాలలను ఎత్తివేయడం దారుణం

**- యుటిఎఫ్ నాయకుల ఆవేదన**



ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని, విలీనం పేరుతో పాఠశాలలను ఎత్తివేయడం దారుణమని యుటిఎఫ్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వెంకటగిరిలోని ఆర్‌విఎం ఉన్నతపాఠశాలలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జివిఎన్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల పట్ల అనుసరిస్తున్న విధానాలపై ధ్వజమెత్తారు. పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డిఏను ప్రభుత్వం వెంటనే మంజూరుచేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ నాయకులు కుమారస్వామి, రామమూర్తిరాజు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

# జనమేజయుని కాలం నాటి .. 'మురగళ్ళ' శ్రీ అనంత కోదండరామస్వామి ఆలయం

*'నమః కోదండ హస్తాయ!*
*సంధీకృత శరాయచ*
*దండితాఖిల దైత్యాయ!*
*రామాయాపన్నివారిణే!'.. అంటూ*

***ప్రాచీనకాలంలో మహామునులు సైతం ఆ కోదండరాముని భక్తితో కీర్తించేవారు. లోకకల్యాణం కోసం కోదండాన్ని చేతబట్టి, ఆ ధనుస్సుతో అద్వితీయమైన అస్త్రశస్త్రాలను సంధించి రాక్షససంహారం చేసి లోకాన్ని ఆపదల నుంచి కాపాడిన ఆపద్బాంధవుడు శ్రీరాముడు!.. అందుకే 'కోదండ'రాముడుగా కూడా ప్రసిద్ధి. ఆపదలు బాపే దైవమైన ఆ శ్రీరామచంద్రమూర్తిని అనాదిగా భక్తులు పూజిస్తూనే ఉన్నారు. దేశవ్యాప్తంగా ఎన్నో రామాలయాలు, వాటిలో ప్రత్యేకించి కోదండహస్తభూషణుడైన కోదండరాముని కోవెలలు మనకు కొల్లలుగానే ఉన్నాయి. అలాంటి దేవాలయాల్లో అత్యంత పురాతనమైన.. శ్రీ అనంత కోదండరామస్వామి దేవాలయం ఒకటి ఆత్మకూరు మండలంలోని 'మురగళ్ళ' గ్రామంలో ఉంది. ఈ ఆలయం జనమేజయుని కాలం నాటిదని ప్రతీతి. ఎంతో ప్రాచీనమైన ఈ ఆలయం ఆవిర్భావం వెనుక పురాణచరిత్రతో పాటు, ఆసక్తికరమైన స్థానిక కథనాలు కూడా ఉన్నాయి.***

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా మండలకేంద్రమైన ఆత్మకూరు నుంచి చీలుదారిలో 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'మురగళ్ళ' అనే గ్రామంలో ఆధ్యాత్మిక భక్తి కేతనంగా భాసిస్తూ శ్రీ అనంత కోదండరామస్వామి దేవాలయం ఉంది. అయితే నేటికీ ఆ ఊరికి బస్సు సౌకర్యం లేదు. ఈ ఊరు దాటితే ఇక పెన్నానది వస్తుంది కనుక, ఇదే అక్కడ చివరి గ్రామం. మురగళ్ళ నుంచి 2 కిలోమీటర్ల దూరంలో పెన్నానది ఉంటుంది. పెన్నానదిని చూస్తున్నట్లుగా ఉంటే శుభకరమని ప్రాచీన కాలంలోనే ఈ ఆలయాన్ని దక్షిణాభిముఖంగా నిర్మించినట్లు భావిస్తున్నారు.





**మన దేవాలయాలు (80)**

## ఆలయ చరిత్ర :

ఈ ఆలయం వేనవేల ఏళ్ళ నాటిది, ఒకవైపు పావన పినాకినీ నది, చుట్టూ సుప్రశాంతమైన.. ఆహ్లాదకరమైన పచ్చని ప్రకృతి వాతావరణంలో ఈ ఆలయం ఉంటుంది. మహాభారత కాలంలో పాండవమధ్యముడైన అర్జునునికి మునిమనుమడైన జనమేజయ మహారాజు ఈ ఆలయాన్ని నిర్మించారని ప్రతీతి. ఊరు పుట్టకముందు నుంచి ఈ ఆలయం ఉందని, సర్పయాగం చేసిన జనమేజయుడు పాపపరిహారార్థం ఎన్నో ఆలయాలు కట్టిస్తున్న క్రమంలో శ్రీరాముని అనుగ్రహం కోసం ఈ ఆలయం కూడా కట్టించి ఉంటారని ప్రసిద్ధి. కాలక్రమంలో.. అంటే సుమారు రెండువందలఏళ్ళ క్రితం ఈ చుట్టుపక్కల నివసిస్తున్న లింగంబేడు గ్రామ ప్రజలు ఈ ఆలయ పరిసరాల్లోకి వచ్చి గ్రామం నిర్మించుకున్నారని, ఈ ప్రాంతంలో ఒకప్పుడు మునులు తపస్సు చేసుకునేవారు కనుక ఈ గ్రామనికి 'మునిగళ' అనే పేరుండేదని, అదే ఈ తరంలో వాడుకలో 'మురగళ్ళ' అయివుంటుందని స్థానికుల కథనం. పురాతనకాలం నాటి ఈ ఆలయం నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. గర్భాలయంలో సీతా లక్ష్మణ సమేత కోదండరాముడు అయిదున్నర అడుగుల శిలా విగ్రహమూర్తి కన్నులపండువగా ఉంటుంది. ఆలయం ముందు భాగంలో మండపం, మరోవైపు ఆంజనేయస్వామి విగ్రహం ఉంటాయి. సుమారు 120 ఏళ్ళ క్రితం గ్రామస్తులు, దాతలు అందరూ కలసి ఆలయానికి ధ్వజస్తంభం నిర్మించారు. అయితే, ఈ ఆలయానికి తొలినుంచి గాలిగోపురం లేకపోవడం విశేషం. ఊరి మొదట్లో సుమారు 50 ఏళ్ళనాటి శివాలయం, అయిదేళ్ళ నాడు నిర్మించిన భారీ ఆంజనేయస్వామి విగ్రహం, పడమరన గంగమ్మ దేవాలయం, పక్కనే చెరువు, దక్షిణాన పెన్నానది, మరోవైపు శ్రీ అనంత కోదండరామాలయంతో గ్రామం ఎల్లప్పుడూ ఆధ్యాత్మిక భక్తిభావనలతో అలరారుతూ ఉంటుంది.

## ఏటా 5 రోజులు శ్రీరామనవమి :

కోదండరామునికి నిత్యపూజలకు కొదవలేదు. శ్రీరామనవమి వేడుకలు అయిదురోజుల పాటు ఎంతోకాలం నుంచి గ్రామస్తులంతా కలసి ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ అయిదు రోజులూ ఈ ఉత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించేందుకు రోజుకొకరు ఉభయదాతగా ఉంటారు. అదేవిధంగా దసరా 9రోజులు, ధనుర్మాసం రోజుల్లోను, ముక్కోటి ఏకాదశి తదితర సందర్భాల్లో స్వామివార్లకు ప్రత్యేకపూజలు, అలంకారాలు ఉంటాయి. ఈ ఆలయం ఇటీవల దేవాదాయశాఖ పరిధిలోకి రావడంతో ఇ.ఓ ప్రసాద్ ఆలయబాధ్యతలు నిర్వహిస్తున్నారు. అర్చకులు తరతరాలుగా ఒకే కుటుంబం వారు పూజలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ వంశానికి చెందిన మురళీకృష్ణమాచార్యుల వారే అర్చకునిగా ఉన్నారు. ఆలయ అధికారులు, దాతలు, గ్రామస్తులు, భక్తులు అందరూ కలసి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తున్నారు.

# కల్యాణ వైభవం...!

కౌటిల్య - వైష్ణవి



నెల్లూరు వాస్తవ్యుడు, ప్రస్తుతం హైదరాబాదులో నివాసం ఉంటున్న నలుబోలు కామేశ్వరరావు - భారతిల కుమారుడు కౌటిల్య - వైష్ణవిల కళ్యాణం డిసెంబర్ 24వ తేదీ చెన్నైలో ఘనంగా జరిగింది. నవదంపతులకు 'లాయర్' అభినందనలు.

ప్రదీప్ - హారిక



నెల్లూరుజిల్లా, గూడూరు తాలూకా మంగళపూర్ వాస్తవ్యుడు, ప్రస్తుత అమెరికా నివాసి ప్రదీప్‌కుమార్‌రెడ్డి - హారికల వివాహం డిసెంబర్ 19వ తేదీ హైదరాబాదులో ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

## జనవరి 2 నుంచి నెల్లూరులో..

# ప్లాస్టిక్‌పై కఠిన నిషేధం

- తనిఖీలు, దాడులకు 400 బృందాలు సిద్ధం
- భారీ జరిమానాలు వేసేందుకు సమాయత్తం

జనవరి 2వ తేది నుంచి నెల్లూరు నగరంలో ప్లాస్టిక్ వినియోగంపై కార్పొరేషన్ అధికారులు కొరడా ఝుళి పించనున్నారు. గతంలో కూడా ప్లాస్టిక్‌ను నిషేధిస్తామని చెప్పినా కారణాంతరాల వల్ల అది పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదు. అయితే ఈసారి మాత్రం సీరియస్‌గా ఉంటామని, అవసరమైతే భారీ జరిమానాలు కూడా విధిస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లలో ఎక్కడ నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయించినా, వినియోగించినా కఠినచర్యలు తప్పవంటున్నారు. ప్లాస్టిక్ విక్రయాలపై కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ దృష్టిసారించి వాటిని అరికట్టేందుకు మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఆధ్వర్యంలో 400 బృందాలను కూడా నియమించారు. దుకాణాలు, హోటళ్ళు, రెస్టారెంట్లు ఇలా ఎక్కడైనా సరే నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, గ్లాసులు, ఇతరత్రా ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తే సీజ్ చేస్తామని, 500 నుంచి 50వేల రూపాయల దాకా జరిమానాలు కూడా విధిస్తామని అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలోని 166 వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 1600 మంది సచివాలయాల కార్యదర్శులు, కార్పొరేషన్‌లోని రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల్లో పనిచేస్తున్న 400 మంది సిబ్బందితో కలిసి దాడులను ముమ్మరం చేయనున్నారు.

# భాజపా భారీ సభ

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా ఆగ్రహసభలో వైకాపాపై నిప్పులు చెరిగింది. భవిష్యత్తులో ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్న లక్ష్యంతో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత రాజధాని విజయవాడలో ప్రజా ఆగ్రహ సభను భారీ స్థాయిలో నిర్వహించి కలకలం సృష్టించింది. బిజెపి ఘాటైన రాజకీయ విమర్శలు చూస్తే..ఒకదశలో ఇది ఎన్నికల సభా..అన్నట్లు కూడా అనిపించింది.

ఆంధ్రలో చాలాకాలం తర్వాత డిసెంబరు 28న బిజెపి ఉన్నట్లుండి పెద్దఎత్తున సభ పెట్టి రాజకీయవర్గాలను ఉలిక్కిపడేలా చేసింది. ఎందుకంటే 2019 ఎన్నికల తర్వాత బిజెపి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఇంత భారీసభ జరపడం బహుశా ఇదే తొలిసారి కావచ్చు. పెద్ద సభ..పెద్ద పెద్దనాయకులు..బెజవాడ అంతా కమలం కోలాహలమే. అందులోనూ కేంద్రమంత్రి, బిజెపి జాతీయనాయకుడు ప్రకాశ్ జావడేకర్ ఈ సభలో పాల్గొని రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ విధానాలను తూర్పారబట్టడంతో పాటు రాష్ట్రంలో తెదేపా, వైకాపా రెండూ ప్రజలను మోసం చేశాయని, వైకాపా, తెదేపా, తెలంగాణలో తెరాసతో సహా ఈ మూడూ కుటుంబపాలన సాగించే పార్టీలేనని, ఆ పార్టీలు పూర్తిగా అవినీతిమయమేనంటూ ఘాటైన విమర్శలు చేశారు. వాటికి ప్రత్యామ్నాయంగా ప్రజలు బిజెపికి అవకాశం ఇవ్వాలని, ప్రజలు ఆశీర్వదిస్తే 2024 ఎన్నికల్లో బిజెపి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. అంతేకాదు, రాష్ట్రంలో ప్రస్తుతం మద్యం డబ్బుతోనే ప్రభుత్వం నడుస్తోందని, ప్రభుత్వం అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిందని, దేవాలయాలను నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో తెదేపా, వైకాపా వైఫల్యాలను చూసిన ప్రజలు ఇప్పుడు బిజెపివైపు చూస్తున్నారన్నారు.

ఒక్క జావడేకర్ మాత్రమే కాదు, సభలో పాల్గొన్న బిజెపి జాతీయ, రాష్ట్రీయ నాయకులంతా మూకుమ్మడిగా రాష్ట్రంలో వైకాపా పాలనపై విమర్శల వర్షం కురిపించారు. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి పురందేశ్వరి, జాతీయ కార్యదర్శి సత్యకుమార్, ఎంపీలు సుజనాచౌదరి, సిఎం రమేష్, జివిఎల్ నరసింహారావు, నాయకులు కన్నా లక్ష్మీనారాయణ తదితర నాయకులంతా వైకాపా ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్నివిధాలా నాశనం చేసిందంటూ ఆరోపణలు గుప్పించారు. గతంలో ప్రధాని మోడీని చంద్రబాబు విమర్శించడాన్ని కూడా గుర్తు చేస్తూ పనిలో పనిగా టిడిపిని కూడా విమర్శించారు. మొత్తంగా ఎన్నికల సభను తలపించే విధంగా జరిగిన ఈ సభలో గతంలో కంటే గట్టిగా నాయకులు వైకాపా ప్రభుత్వంపై విమర్శలు చేయడం విశేషం. అగ్రనాయకుల ప్రసంగాలతో బిజెపి కార్యకర్తలు, నాయకుల్లో మునుపెన్నడూ లేనంత ఉత్తేజం..ఉత్సాహం కనిపించింది.

### ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే?...

ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తిరుపతికి వచ్చినప్పుడు రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ అమరావతి రైతులు చేస్తున్న పాదయాత్రకు మద్దతుగా బిజెపి నాయకులు పాల్గొనాలంటూ చేసిన దిశానిర్దేశంతో నాయకులంతా హుటాహుటిన రైతుల పాదయాత్రలో పదం కలిపిన విషయం తెలిసిందే. 'న్యాయస్థానం నుంచి దేవస్థానం దాకా' అనే నినాదంతో రైతులు పాదయాత్ర చేస్తుంటే ఆ విషయంలో బిజెపి నాయకుల్లో భిన్నాభిప్రాయాలు అనవసరమనే స్పష్టతనివ్వడంతో నాయకులు కలదెలుసుకుని రైతులతో కలసి నడిచారు. రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అమరావతే కొనసాగుతుందంటూ బిజెపి శ్రేణులు కూడా గట్టిగా చెప్పడం ఆనాటి నుంచే ప్రారంభించారు. విజయవాడ సభలో కూడా అదే విషయాన్ని పదేపదే చెప్పారు.

### విమర్శలకు గురవుతున్న..సోము 'చీప్' వాగ్దానాలు...

'మాకు అధికారం ఇస్తే..మూడేళ్ళలో అమరావతిని నిర్మిస్తాం' అంటూ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు సోము వీర్రాజు కూడా స్పష్టం చేయడం అక్కడి రైతాంగాన్ని ఆకట్టుకోడానికేనన్నది అందరికీ తెలిసిందే. అయితే ఇదే సందర్భంలో 'మేం అధికారంలోకి వస్తే 50 రూపాయలకే చీప్‌లిక్కర్ బాటిల్ ఇస్తాం'.. అంటూ సోము అత్యుత్సాహంతో చేసిన వ్యాఖ్యలు మరీ చీప్‌గా ఉన్నాయని, ఆయన అలా మాట్లాడకుండా ఉండాల్సిందని బిజెపి వర్గాలే అంటున్నాయి. ఇక నెటిజన్ల సంగతి వేరే చెప్పాలా?.. సందు దొరికిందే తడవుగా సోము మాటలు మరీ దిగజారుడుతనంగా ఉన్నాయంటూ దుయ్యబట్టేస్తున్నాయి.

ఏదేమైనా..మొన్న తిరుపతిలో జరిగిన అమరావతి రైతుల 'న్యాయస్థానం నుండి దేవస్థానం దాకా' ముగింపు సభ, నిన్న విజయవాడలో జరిగిన 'బిజెపి ప్రజా ఆగ్రహ సభ'ల తీరును పరిశీలిస్తే, ఇది ప్రత్యేకించి వైకాపా ప్రభుత్వంపై నిరసనగా పెట్టిన 'బిజెపి ఆగ్రహ సభ'లాగానే ఉంది. ఎప్పుడో రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బిజెపి ముందుగానే రంగం సిద్ధం చేసుకుంటోందని దీన్ని బట్టి తెలుస్తోంది. ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే 'ముందు సన్నద్ధతగా' బిజెపి నాయకులు ఇలాంటి భారీసభ నిర్వహించి ఉంటారన్నదే అందరూ అనుకుంటున్నది. అయితే, ముందస్తు ఎన్నికలే వస్తాయో, జమిలి ఎన్నికలొస్తాయో అసలు ఎప్పుడు ఎన్నికలొస్తాయో..ఏ విషయం తేలడానికి ఇంకా చాలా సమయం ఉన్నా.. అన్నీ తెలిసిన 'కోయిల ముందే కూసిందన్నట్లుగా'..బిజెపి ఇప్పటినుంచే ఇలాంటి భారీ సభలతో ఎన్నికల వాతావరణాన్ని తలపించేలా చేయడం రాష్ట్రంలోనే కాదు దేశ రాజకీయవర్గాల్లో కూడా చర్చనీయాంశమైంది.

# ఆనందయ్యా.. నీ మందొద్దయ్యా

(మొదటి పేజీ తరువాయి)

అప్పట్లో ఆనందయ్య మందు గురించి ప్రచారం జరగగానే... ఒక్క నెల్లూరు జిల్లాకి సంబంధించిన అధికార పార్టీ నాయకులే కాకుండా రాష్ట్ర మంత్రులు సైతం ఆనందయ్యని పిలిపించుకుని మందు తయారు చేయించి తమ తమ ప్రాంతాలలో బట్వాడా చేయించారు. ఒక నాయకుడైతే ఏకంగా ఆనందయ్యని రహస్య ప్రదేశానికి తీసుకెళ్ళి తన నియోజకవర్గం మొత్తానికి అవసరమైన మందు తయారు చేయించుకున్న తరువాతే ఆయనను బయటకు విడుదల చేశారు. ఇక ఆ తరుణంలో అధికారపార్టీ మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులు ఆనందయ్య అపాయింట్‌మెంట్ కోసం తమ పలుకుబడినంతా ఉపయోగించారు. ప్రజలు సైతం ఆనందయ్య ఎక్కడికి వెళ్ళినా బ్రహ్మరథం పట్టారు. మేళ తాళాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అధికారులు కూడా ఆయనతో సమీక్షలు జరిపారు. చివరికి ఆయన మందుకి షరతులతో కూడిన అనుమతులు కూడా మంజూరుచేశారు. ఆ సమయంలో ఆనందయ్య అతిపెద్ద సెలబ్రిటీ. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వ్యాధి ఆనందయ్య మందుతో తగ్గిపోతుందన్న ప్రచారం రావడంతో ఒక్కసారిగా ఆనందయ్యకు విశేషప్రాచుర్యం లభించింది. తనకు తెలిసిన చిట్కాతో పేరుప్రఖ్యాతులతో ఆర్థికంగా కూడా ఆనందయ్య బాగా బలపడ్డాడన్న ప్రచారం జోరుగా సాగింది. క్రమేణా కరోనా తగ్గుతూరావడంతో ఆనందయ్య మందుకి డిమాండ్ తగ్గింది. ఇదే తరుణంలో ఆయన సొంతంగా రాజకీయపార్టీ పెట్టబోతున్నట్లు కూడా ప్రకటించాడు. ఆ ప్రకటనే ఇప్పుడు ఆయన కొంప ముంచింది.

### అప్పుడు 'ఎస్' అన్నోళ్ళే... ఇప్పుడు 'నో' అంటున్నారు ...

ఆనందయ్య మా గ్రామానికి చెందినవాడైనందుకు మేము గర్వపడుతున్నాం అన్న గ్రామస్థులు, మా పార్టీ వాడైనందుకు ఆనందిస్తున్నాం అన్న రాజకీయ నాయకులు, అధికారికంగా అనుమతులు ఇస్తున్నాం అని ప్రకటించిన ప్రభుత్వ అధికారులు.. ఇప్పుడు ఆనందయ్య స్పీడుకి బ్రేకులు వేశారు. ప్రపంచాన్ని కలవరపెడుతున్న 'ఒమిక్రాన్'కి తన దగ్గర మందుందని, కావలసినవాళ్ళు సంప్రదించవచ్చని ఆనందయ్య ప్రకటన ఇచ్చాడు. వెంటనే స్పందించిన గ్రామస్తులు నువ్వు మందు ఇవ్వడానికి లేదని అడ్డుకున్నారు. అధికారులు నోటీసిచ్చారు. రాజకీయ నేతలు పంచాయతీ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయించి, ఆనందయ్య మందుకి అనుమతులు ఇవ్వబోమని తీర్మానించారు.

ఆనందయ్య ఆర్థికంగా బాగా లాభ పడ్డాడన్న వార్తలు, అందుకు తగ్గట్లుగా తాను త్వరలో రాజకీయ పార్టీ పెట్టబో తున్నట్లుగా చేసిన ప్రకటన ఇప్పుడు ఆయన కొంపముంచాయి. ఆయన మందు కోసం ఆయన ఇంటిముందు పడిగాపులు కాసిన వారే.. ఇప్పుడు ఆనందయ్యా... నీ మందొద్దయ్యా! అంటున్నారు.

రాజకీయమా వర్ధిల్లు...!

# ఒమిక్రాన్!

(మొదటి పేజీ తరువాయి)

ఏమీ లేదని డాక్టర్లు ఒకవైపు చెప్తున్నా ప్రమాదం మాత్రం కాదని అదే వైద్యులు అంటున్నారు. కాబట్టి మన జాగ్రత్తలో మనం ఉందాం. మాస్కులు వేసుకుందాం, సామాజిక దూరం పాటిద్దాం, శానిటైజర్ వాడుదాం, సమూహాలకు దూరంగా ఉందాం.

'ఓ మై గాడ్ ఒమిక్రాన్' అనుకోవడం కన్నా, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది... అనుకోవడం మిన్న.

## కోదండరామునికి.. వెండి వస్తువుల వితరణ


స్వామివారికి వెండి యజ్ఞోపవీతాలను సమర్పిస్తున్న పవన్‌కుమార్

నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టే పాళెం గ్రామంలో కొలువై ఉన్న సీతా లక్ష్మణ సమేత శ్రీ కోదండరామునికి ఆ గ్రామానికి చెందిన తుమ్మలచర్ల రమణయ్య జ్ఞాపకార్థం వారి సతీమణి విజయమ్మ, కుమారుడు పవన్‌కుమార్‌లు సుమారు 40వేల రూపాయల విలువచేసే యజ్ఞోపవీతాలను వితరణగా సమర్పించుకున్నారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారికి అదే గ్రామానికి చెందిన నాదెండ్ల సుబ్బరామయ్య జ్ఞాపకార్థం వారి సతీమణి పెంచలమ్మ, కుమారులు సుమారు 17వేల రూపాయలు విలువచేసే రెండు వెండి తీర్థపాత్రలు, ఒక ఉద్ధరిణిని తమ వితరణగా సమర్పించారు. వీటిని ఆలయ కమిటీ ఛైర్మెన్ పొన్నాల రామచంద్రారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వరప్రసాద్‌లకు ఈనెల 27న అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖమండపం దాత పొన్నాల వెంకటశేషారెడ్డి, అర్చకులు పరాంకుశం కులశేఖరాచార్యులు, ట్రస్టుబోర్డు సభ్యులు ఉప్పాల రామచంద్రయ్య, మల్లికార్జునతో పాటు చేకూరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## భక్తిపూర్వకంగా.. శ్రీ వేంకటేశ్వర కల్యాణం



నెల్లూరులోని మైపాడురోడ్డులో ఉన్న డిజిపి కల్యాణ మండపంలో టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్, స్థానిక శ్రీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం రమణీయంగా జరిగింది. వేదపండితులు వేదగిరి ఫణిశర్మ, అర్చక బృందం వారు స్వామివారి కల్యాణాన్ని ఆద్యంతం భక్తిపూర్వకంగా నిర్వహించారు. స్వామివార్ల కల్యాణవిశేషాలను అర్చకులు వివరిస్తూ కల్యాణోత్సవం నిర్వహించడం భక్తులందరినీ ఆకట్టుకుంది.

## కమనీయం..శివపార్వతుల కల్యాణం



మార్గశిర మాసం సోమవారం ప్రత్యేక శుభ ముహూర్తాన్ని పురస్కరించుకుని నెల్లూరు, డిజిపి కల్యాణ మండపంలో ఈనెల 27న శివపార్వతుల కల్యాణమహోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక శ్రీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవాసమితి, శివకేశవ లక్షదీపోత్సవ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో ఆదిదంపతులకు వివిధ రకాలైన సుగంధభరిత పుష్పాలతో కన్నులపండువగా పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాలు సేవాసమితి అధ్యక్షుడు కళాదీప్తి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగాయి. సేవాసమితి గౌరవాధ్యక్షుడు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, గౌరవసలహాదారు మల్లెల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. తొలుత నిర్వహించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.









## ఎన్‌బికెఆర్‌లో ప్రత్యేక శిక్షణా తరగతులు

### ○ ఆరు రోజుల పాటు ఆన్‌లైన్‌లో ప్రత్యేక బోధన



ప్రారంభ సభలో మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి

కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏఐసిటిఇ–ఐఎస్‌టిఇ వారి సౌజన్యంతో రిఫ్రెషర్ ప్రోగ్రామ్‌ను ఆరురోజుల పాటు నిర్వహిస్తూ, వివిధ రంగాల్లోని నిపుణులతో ఆన్‌లైన్‌లో ప్రత్యేక బోధనలు కొనసాగిస్తున్నారు. ఇందులో తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి సుమారు 75 మంది అధ్యాపకులు పాల్గొంటున్నారు. ఇటీవల జరిగిన ప్రారంభోత్సవ సభలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మెన్ ప్రొఫెసర్ కె. హేమచంద్రరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులు నూతన రంగాలపై పట్టు సాధించాలన్నారు. అందుకు తగినట్లుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా విధానం, ముందుచూపు అందుకు ఎంతగానో దోహదపడుతున్నాయన్నారు. ఇలాంటి శిక్షణా తరగతులు నూతన విద్యాపద్ధతులపై తర్ఫీదు పొందేందుకు ఉపయోగపడతాయన్నారు. అన్ని సామాజికవర్గాలకు చెందిన విద్యార్థులు విద్యా రంగంలో ముందంజలో ఉంటున్నారని, అందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ముందుచూపుతో ప్రవేశపెట్టిన అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన లాంటి పథకాలతో ఇదంతా సాధ్యమవుతోందని చెప్పారు. విద్యారంగం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కోట్లాదిరూపాయల నిధిని కేటాయిస్తున్నారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో డస్సాల్ట్ సిస్టమ్ లా ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హేమంత గాడ్గిల్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సాగర తీరాన్ని శుభ్రపరచిన

## ఎన్‌సిసి క్యాడెట్లు



ప్రధాని మోడీ ఆదేశాలతో డిసెంబరు 1 నుంచి దేశంలోని సముద్రతీరాల్లో నిర్వహిస్తున్న 'పునీత్ సాగర్ అభియాన్' (స్వచ్ఛ సాగరతీర) కార్యక్రమంలో భాగంగా 10–ఆంధ్ర నావెల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్, కమాండింగ్ ఆఫీర్ వినయ్ రామచంద్రన్ సూచనలతో జిల్లాలోని ఇందుకూరుపేట మండలంలో ఉన్న మైపాడు బీచ్‌లో పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. సాగరతీరంలో ఉన్న చెత్తాచెదారాన్నంతా తొలగించి శుభ్రం చేశారు. ఈనెల 27న జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు భక్తవత్సలనగర్ లోని కెవన్‌ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలలోని ఎన్‌సిసి నావెల్ యూనిట్ సెకండ్ ఆఫీసర్, అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన పర్యాటకులకు సాగరతీరంలో పరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యల పట్ల అవగాహన కల్పించారు. మనందరం ఆరోగ్యంగా ఆనందంగా జీవించాలంటే మనచుట్టూ ఉన్న పరిసరాలతో పాటు నదులు, సాగరతీర ప్రాంతాలు కూడా కలుషితం కాకుండా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని వివరించారు.

## దళారీ వ్యవస్థను రూపుమాపుతాం

### జిల్లా దేవాదాయశాఖ ఏ.సి శ్రీనివాసులురెడ్డి


వ్యాపార సముదాయాలను తనిఖీ చేస్తున్న శ్రీనివాసులురెడ్డి

గూడూరు, ధర్మరాజుల స్వామి గుడి ఆధీనంలోని ద్రౌపది కాంప్లెక్స్, మరికొన్ని వ్యాపార సముదాయాలకు సంబంధించి అద్దె గదులను కొందరు చాలా సంవత్సరాలుగా లీజుకు తీసుకుని వేరొకరికి ఆ గదులను పెద్ద మొత్తాలకు అద్దెకు ఇచ్చి దళారీలుగా మారుతున్నారన్న సమాచారం తెలుసుకున్న నెల్లూరుజిల్లా దేవాదాయ శాఖ ఏ.సి శ్రీనివాసులురెడ్డి ఇటీవల ఆ వ్యాపార సముదాయాలను తనిఖీ చేశారు. ఈ దళారీ వ్యవస్థను రూపుమాపి అద్దెలు నేరుగా దేవాదాయశాఖకు వచ్చేలా చూస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

## హెచ్‌ఐవిపై అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న సార్డ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ జైచంద్ర

గూడూరు, ఐటిఐ కళాశాలలో డిసెంబర్ 28న సార్డ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు హెచ్‌ఐవి(ఎయిడ్స్)పై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సార్డ్స్ గూడూర్ ప్రాజెక్ట్ మేనేజర్ జైచంద్ర పాల్గొని హెచ్‌ఐవికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాములు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న సార్డ్స్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.







# ఈ ఆనందం మాటల్లో వర్ణించలేనిది



- పినాకిని గాంధీ ఆశ్రమంలో.. మన సతీష్‌రెడ్డి
- ఆశ్రమ అభివృద్ధికి కృషిచేస్తామన్న డిఆర్‌డిఓ ఛైర్మెన్

డిఆర్‌డిఓ ఛైర్మెన్, మన నెల్లూరీయుడు సతీష్‌రెడ్డి నెల్లూరు జిల్లాలో ఎంతో చరిత్రప్రసిద్ధి గాంచిన పినాకిని గాంధీ ఆశ్రమాన్ని సందర్శించి మురిసిపోయారు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు పొణకా కనకమ్మ తదితర పోరాటవీరుల ఆకాంక్షలకు ప్రతిబింబంగా రూపుదిద్దుకున్న ఈ ఆశ్రమం స్వయంగా జాతిపిత గాంధీజీ చేతుల మీదుగా ప్రారంభించిన విషయం అందరికీ తెలిసిందే. అంతటి చరిత్రాత్మకమైన ఈ ఆశ్రమాన్ని సందర్శించడం.. ఆ ఆనందం అనుభూతి మాటల్లో వర్ణించలేనివంటూ సతీష్‌రెడ్డి ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడులో పినాకినీ నదీ తీరంలో సుప్రశాంతమైన వాతావరణంలో నెలకొల్పిన ఇంతటి ఘనమైన ఆశ్రమాన్ని భారత రక్షణ పరిశోధన రంగం ఛైర్మెన్ సతీష్‌రెడ్డి సందర్శించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆయన ఆశ్రమాన్ని అడుగడుగునా పరిశీలించారు. గాంధీజీ నడయాడిన ఈ ఆశ్రమమంతా కలయదిరుగుతూ మురిసిపోయారు. గుజరాత్‌లోని సబర్మతి ఆశ్రమం తర్వాత గాంధీజీ స్వహస్తాలతో ప్రారంభించిన పల్లిపాడు ఆశ్రమం రెండవదని, ఎందరో త్యాగధనుల త్యాగాలకు ఇది నిదర్శనమని సతీష్‌రెడ్డి అన్నారు. ఆశ్రమ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఇటీవల భారీవానలు, వరదలు వచ్చి ఆశ్రమంలోని కొంతభూమి పెన్నానదిలో కోతకు గురై నదిలో కలిసిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇలా వరదలు వచ్చినప్పుడల్లా ఆశ్రమభూములు కోతకు గురవుతుండడం ఆశ్రమ మనుగడకే ప్రమాదమని అంటూ, ఈ విషయాన్ని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రివిట్‌మెంట్ వాల్ కట్టించేందుకు కృషిచేస్తానని ఆయన చెప్పారు. ఆ తర్వాత ఆశ్రమంలో కూర్చుని రాట్నం పట్టుకుని నూలు వడికారు.

గాంధీజీ జ్ఞాపకాలతో ఉన్న ఫోటోలను తిలకించి ఆనందించారు. అక్కడున్న చిన్నారులతో మమేకమై మాట్లాడుతూ అందరూ కష్టపడి చదువుకుని ఉన్నతస్థాయికి రావాలని చెప్పారు. అనంతరం పల్లిపాడు గాంధీ ఆశ్రమకమిటీ వారు సతీష్‌రెడ్డికి గాంధీజీ చిత్రపటాన్ని బహుకరించారు. తొలుత ఆశ్రమంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి, ఆశ్రమ స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహానికి సతీష్‌రెడ్డి ఖాదీవస్త్రాలు సమర్పించి, నూలుమాలలు వేసి వారికి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి, జీవి రామిరెడ్డి, మంజుల తదితరులతో పాటు రెడ్‌క్రాస్ సభ్యులు పాల్గొన్నారు.












## 11వ వర్ధంతి

పూజ్యులు, మా ఇంటి దైవం
మా పురోభివృద్ధికి ముఖ్యకారకులు, "మిత్రబంధు"

### శ్రీ నారపరెడ్డి కోదండరామరెడ్డి, M.A. గారు

(మైపాడు వాస్తవ్యులు)
స్వర్గస్తులై తేది 05-01-2022 నాటికి
పదకొండు సంవత్సరాలు నిండనున్న సందర్భంగా
*ఆయన దివ్యస్మృతిని స్మరించుకుంటూ*
*వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...*

**శ్రీమతి నారపరెడ్డి సులోచనమ్మ** - భార్య

కుమారులు - కోడళ్ళు
**డాక్టర్ ఎన్.విష్ణుస్వరూప్‌రెడ్డి - డాక్టర్ శాంతి**
**ఎన్.వినోద్‌రెడ్డి - షాలిని**

కుమార్తెలు - అల్లుళ్ళు
**జి.సుప్రియ - జి.విజయసింహారెడ్డి**
**ఎన్.పద్మప్రియ - ఎన్.చంద్రారెడ్డి**

మనుమలు, మనుమరాండ్రు
**జి.అభిషేక్‌రెడ్డి, వైష్ణవి**
**జి.అనుదీప్, భావిక, రాహిల్, రుషిల్ సాకేత్,**
**విశాల్, మేఘన, హర్ష, సంజన, వినూష**

మునిమనుమరాలు - **అమైర, ఆరియ**

CRM IT Customer Success Partner | Fortune Summit business park NR Towers, BANGALORE.

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com